# మంచి యొక్క ఫలితం గొప్పది

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

"ప్రపంచములో చెడును క్షాళనం చేసేదెలా? దానిని గుర్తించి, విమర్శించి, నిరసిస్తేగదా?" అని అన్పించవచ్చు. కానీ పైరు వేసుకున్నట్లు మంచి భావాలను, మాటలను మననం చేసుకుంటూ, సాటివారి చేత చేయించుకుంటూ పోతుంటే కలుపు మొక్కలలాగా చెడు దానికై అదే తరుగుతుంది. ప్రతిహృదయం ఒక సారవంతమైన భూమి వంటిది. మంచిని నాటుకొంటూ పోతుంటే, కక్రతుమ్మలలాగా చెడు దానినంతటినీ ఆక్రమిస్తుంది. అంతేకాదు, చెడును నిజంగా ఎదుర్కోవడంలో ఏవ్యక్తినీ నిర్దేశించడముండదు. వ్యక్తిగతమైన అసూయాద్వేషాలే వ్యక్తి విమర్శ వెనుక వుండేది.

గోకిన కొద్దీ తగ్గేబదులు గజ్జి మరింత ఎక్కువైనట్లు, చెడు అన్నది యిలాంటి వ్యక్తి విమర్శల వలన పెచ్చు పెరుగుతుంది. మన హృదయాలు కలుషిత మవుతాయి. పోను పోను అదే సత్యము, మంచియని భ్రమించి, మన ప్రవర్తనంతా దాని పరమవుతుంది. దానినే నేటి మనస్తత్వ శాస్త్రము 'బ్రైన్ వాషింగ్' అంటుంది. మొదట నింద్యమని తెలిసినది కూడా అభ్యాసముచేత ఆమోదయోగ్యమై, ప్రీతికర మవుతుంది. చివరికి అదే ధర్మమని కూడా అనిపిస్తుంది. ఈ బలహీనత గలవారితో సాంగత్యం చేసి, అవే మాటలు పదేపదే వింటూంటే అదే నిజమన్పిస్తుంది. అందుకే అట్టివారి సాంగత్యము దుస్సాంగత్య మవుతుంది. పాపము చేసినవారితో సాంగత్యం చేసినవారు కూడా అట్టి పాపియే అవుతాడని ధర్మశాస్త్రం చెబుతుంది.

ఇందుకు కారణము బౌద్ధ గ్రంథాలు చక్కగా వివరించాయి. విశ్వమంతా సమరసమూ, ఏకరసమూ అయిన సముద్రం వంటిదని, అందులో భాగాలమైన మన ప్రతి భావము, మాట, చేతగూడ చుట్టూ విశ్వంలో తత్సంబంధమైన స్పందనాలను (vibrations) ఉత్పన్నం చేసి ఆమేరకు సృష్టిని ప్రభావితం చేస్తుందంటారు. కనుక అసలే దుఃఖ పాపమయమైన ఈ ప్రపంచాన్ని కించిత్తు కూడా మలిన పరచకుండడం, యథాశక్తి పవిత్రమైన భావ స్పందనతో నింపడం ప్రతి సాధకునికి కర్తవ్యమని ఆ గ్రంథాలు చెబుతాయి. కనుక సమ్యక్ (మంచి) వాక్కు, సమ్యక్ దృష్టి, సమ్యక్ కర్మ బౌద్ధధర్మమని చెబుతాయి. ఇదే సూత్రం మన నిత్యానుష్ఠానములో భాగంగా మహర్షులు వుద్దేశించారు. 'సర్వేజనాః సుఖినో భవంతు, లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అని ప్రతి పారమార్థికుడు సంకల్పించాలి. 'అనోభద్రా క్రతవో యాన్తు విశ్వతః,' 'విశ్వంలో అన్నివైపుల నుండి ఉత్తమమైన భావాలు మాకు చేరుగాక' అని వేదర్షులు గానం చేశారు.

కారణము దేనిని గురించి మనము పదేపదే తలుస్తామో, ఆలోచిస్తామో అంతమేరకు ఆ భావం మనకు సోకుతుంది. ద్వేషంతోనైనా నిరంతరం పరమాత్మనే తలచిన రాక్షసులకు సైతం చివరకు పరమాత్మ ప్రాప్తి కలిగినట్లు పురాణాలు కూడా చెబుతాయి. రామకృష్ణ పరమహంస చెప్పిన కథ గుర్తుకొస్తోంది. ఒక వేశ్య ఎప్పుడూ తన దౌర్భాగ్యమైన జన్మ చూసి పరితపిస్తూ ఎదుటి ఇంటిలోని శ్రోత్రీయ బ్రాహ్మణుని గురించి 'అతడెంత అదృష్టవంతుడో, ధన్యుడో కదా అని ఆలోచిస్తూండేదట!' ఆ శ్రోత్రీయుడు బాహ్యంగా తన ఆచారాన్ని పాటిస్తున్నా లోలోన

***మిగతా 29వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:44 మే - 2026 సంచిక:01

***పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"***

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | మంచి యొక్క ఫలితం గొప్పది | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | అభయప్రదాత | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | ఇహపరంబుల నొసగునట్టి గురుదంపతుల లీలా కళ్యాణ వైభవం! | శ్రీమతి టి. పద్మావతి | 10 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 14 |
| 06. | పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ 37వ ఆరాధనా మహోత్సవం!! | శ్రీమతి టి. పద్మావతి | 16 |
| 07. | మాతృదేవి స్మృతులు | శ్రీ దుర్గా ప్రసాద్ | 19 |
| 08. | శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం) | శ్రీమతి టి. పద్మావతి | 22 |
| 09. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 26 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | జేమ్స్ ఉడ్ | 27 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ టి. కె. పురుషోత్తం | 28 |


సలాభావం వల్ల ఈ సంచికలో, 'బుద్ధ ధ్యాన హృదయము, మరియు 'శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితము మరియు బోధలు' ప్రచురింపబడటం లేదు. – ఎడిటర్

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

### చందా వివరములు

విడి ప్రతి : ₹10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

***ప్రశ్న :- సాయిబాబా గత సంచికలో ప్రచురించిన దేవాలయాలెందుకు? అన్న వ్యాసం చదివాను. దేవాలయాలు అవసరం లేదనా మీ అభిప్రాయము? తెలుపవలసినది.***

***- ఒక పాఠకుడు***

**జవాబు :-** ఏదైనా సద్వినియోగమైతే ఉపయోగము. లేకుంటే నిరుపయోగమేగాక, సామాన్యంగా అవాంఛనీయమౌతాయి గూడ. ప్రకృతిలో ఉపయోగంలేనిది విడిచివేయబడుతుంది – మల మూత్రములవలె. అలా జరుగనప్పుడు స్వస్థత చెడుతుంది. అలానే ఆహారం అరిగితే మంచిది; లేకుంటే అది వాంతిగాగానీ లేక మలంగాగాని వెడలిపోవాలి. లేకుంటే హాని చేస్తుంది. ఎక్కువ విలువైన వస్తువులలో యీ ద్వయీభావం మరీ తీవ్రంగా వుంటుంది. ఉదాహరణకు తక్కువ ఆవశ్యకతయైన చర్మము మీద వ్యాధికంటే అతి విలువైన గుండె, నరాలు, ఊపిరితిత్తులు వంటి భాగాలలోని వ్యాధులు అత్యంత ప్రమాదకరములు. అనావశ్యకమైన పదార్థాలను విసర్జించే మూత్రపిండాలు ఆపని సరిగా చేయకున్నా ప్రాణ ప్రమాదం సత్వర మేర్పడుతుంది. అవసరమయిన ప్రాణవాయువు, పోషకములను స్వీకరించడము – బొగ్గుపులుసు వాయువు, మాలిన్యాల విసర్జనము––యిదే జీవ లక్షణము. ఆధ్యాత్మికతలో గూడ భక్తి––వివేకముల క్రియ యిదే–– దుఃఖ నివృత్తికి ఆవశ్యకమైన జ్ఞానము, భక్తులను పొందడము, దుఃఖకరములైన అవివేకము, రాగద్వేషాదులు మొ||నవి విసర్జించడమూ అవసరము. సామాన్యులు యీ అవాంఛితాలను వీడరు గనుకనే అప్రశస్తమైన విత్తనాలు మననట్లు, మొలకెత్తనట్లు సరిగా భక్తిజ్ఞానాలు నాటుకోవు, వృద్ధిచెందవు. అట్టివారి పరిస్థితి త్రిశంకుస్వర్గమే– వ్యాధికి మందు తీసుకొని పథ్యము చేయనట్లే. ఒక్కొక్కప్పుడు నిరుపమోగమే గాక ప్రమాదకరం గూడ.

దేవాలయాల ఆవశ్యకతను గూడ దీనిని బట్టే నిర్ణయించాలి. నిధులు పోగుచేసుకొనడము, శైవ వైష్ణవ తగాదాలు, తిరుణాళ్ళప్పుడు రికార్డుడాన్సులు, ఆలయంపై ఆధిపత్యంకోసం కార్యకర్తలలో తగవులూ మాత్రమే అవి చేసే కార్యక్రమమైతే లాంఛనంగా భగవంతుడు ఏడ్చిపోతాడేమోనన్నట్లు – ఖైదీ కిలాగ నిత్య ధూప దీపాలు మాత్రం భక్తిశ్రద్ధలు లేని అర్చకులు చేయడం భగవంతునికి, సమాజానికి గూడ అవసరమే గాదు. తగవులు, తన్నులాటలు, ఆలయదోపిడీలు, ఘరానా స్వాహాలు యివి మాత్రమే పర్యవసానాలవుతాయి. ప్రజల దృష్టిలో, మతం పరువు మంటగలవటానికే పనికివస్తాయి.

మన సంస్కృతికే లజ్జాకరమైన పుక్కిటి పురాణాలను, శైవ వైష్ణవ ద్వేషాలను ప్రకటించి ప్రజలను రెచ్చగొట్టే ప్రక్షిప్తాలతో నిండిన పురాణాల శ్రవణమే చేయిస్తూ యితర మత ప్రచారకులు, నాస్తిక హేతువాదులు భయంకరంగా విమర్శించే అవకాశము కల్పించే కార్యక్రమాలనే చేపట్టేట్లయితే మందిరాలుండరాదు. ఎవరూ వేలెత్తి చూపలేని, తలవంచక తప్పని శిరిడీ

**మిగతా *29*వ పేజీలో**

(జూన్ 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)

# అభయప్రదాత

## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

భయము అన్నది చాలా భయంకరమైన విషయము. అసలు భయమంటే ఏమిటో అది మనందరికీ చాలా సందర్భాలలో అనుభవమవుతుంది గనుక తెలుసు.

భయము అనేక రకాలు. సాధారణంగా క్రూర జంతువులను చూస్తే ఎవరికైనా భయమేస్తుంది. ఉదాహరణకు పులి, సింహము, పాము మొ॥వి మనలను కరుస్తాయి, ప్రాణాలు తీస్తాయి గనుక భయపడడం సహజమే. కానీ కొంతమందికి మనకేమీ హాని చేయని జీవులను చూస్తేగూడ భయమేస్తుంది. పిల్లిని చూసి కొందరు భయపడితే, బల్లిని చూసి భయపడేవారు కొందరు. కొందరు పురుగులను చూసి, ఎలుకలను చూసి, బొద్దింకలను చూసిగూడ భయపడతారు. అవి మనకు పెద్దగా హాని చేయవు. కానీ భయపడడమెందుకు? అంటే ఇక్కడ భయానికి కారణం వాటి ఆకారాలను చూస్తే మనకు గల అసహ్యామే!

ఇవి గాక జీవితంలో యింకా చాలా భయాలుంటాయి. చదువుకోకపోతే జీవితం గడిచేదెలా? అన్న భయం. చదువుకున్న తర్వాత ఉద్యోగం రాదేమోనన్న భయం. ఉద్యోగం వస్తే పోతుందేమోనన్న భయం. సంపాదించిన డబ్బును ఎవరైనా కాజేస్తారేమోనన్న భయం. దొంగలు దోచేస్తారేమోనన్న భయం. ఖర్చు పెట్టుకుంటే భవిష్యత్తు ఎలా అన్న భయం. డబ్బు ఆశతో ఎవరైనా ఏదైనా చేస్తారేమోనన్న భయం.

అలాగే దారిద్ర్యమంటే భయం. అనారోగ్యమంటే చాలా భయం.

అన్నింటికంటే గొప్పది మృత్యువు గూర్చిన భయం. ప్రతి మనిషికీ మృత్యువంటే ఎంతో భయం. కారణం 'తన' అనుకున్న వాటిని అన్నింటినీ విడిచి వెళ్ళిపోవలసి వస్తుందని. తన వాటి మీద వున్న మమకారం అందుకు కారణం. అందుకని మృత్యువు నుంచి తప్పించుకోవాలని ప్రతి మనిషీ కోరుకుంటాడు. వయసు పెరిగిన కొద్దీ ఏ క్షణాన మృత్యువు కబళిస్తుందోనన్న భయం పీడిస్తుంది. నడి వయసులో వున్న వారికి అభద్రతాభావం వల్ల భయం.

యువకులకు మరణభీతి వుండకపోవచ్చుగానీ ఎదుర్కొంటున్న పరిస్థితిల వల్ల ఆందోళన, భయము వుంటున్నాయి. కనుక ఏ మానవుడూ పూర్తి నిర్భయంగా వుండలేకపోతున్నాడు.

కలిప్రభావం వలన స్వార్థం పెచ్చుపెరగడం వల్ల నేడు భయం విలయతాండవం చేస్తున్నది. ఏదో జరుగుతుందేమోనన్న భయంతో నేటి మానవుడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఏదో పైకి కొంత ధైర్యంగా వున్నట్లు కనిపించినప్పటికీ అది అంతంతమాత్రమే.

నేడు మనిషికి సాటి మనిషంటేనే ఎక్కువ భయమని అనిపిస్తున్నది. పేదవారి దగ్గరనుంచీ గొప్ప ధనవంతులదాకా, సామాన్యుల దగ్గరనుంచీ రాజ్యమేలుతున్న వారి దాకా ఈ భయం సహజమైపోయింది. ఈ రోజులలో ఎవరు ఎవరిని ఏమైనా చేయవచ్చు. అనేక కారణాలుగా ఎవరు ఏ విధంగానైనా కక్ష తీర్చుకోవచ్చు. ధనం కాజేయవచ్చు. ప్రాణాలనే తీసేయవచ్చు. కొందరు మనుషులు జంతువుకంటే హీనంగా ప్రవర్తిస్తున్నారనడంలో సందేహం లేదు. జంతువులకంటే అని ఎందుకు అనుకోవలసివస్తున్నదంటే జంతువులు ఆహారం కోసమో లేక ప్రాణభీతి వల్లనో మాత్రమే ఇతర జీవులపై దాడి చేస్తాయి. మనుషులు అలాంటి కారణాలేవీ లేకుండా గూడ అనేక విధాలుగా

పీడిస్తున్నారు.

అసలు మనిషికి వుండవలసినది సాటి మనిషి మనకు తోడు వున్నాడన్న ధైర్యం. అందుకే మానవుడు సాటి మానవులను తోడుగా కోరుకుంటాడు. సమాజం ఏర్పడినది అలానే. కానీ తోడుగా వుండవలసిన సాటి మానవుడు పీడగా మారుతుంటే చేయగలిగినదేమున్నది? కంచే చేను మేస్తే కాపాడేదెవరు?

ఇదివరకు మనిషికి మనిషి తోడుగా వుండేవాడు. తనకు తల్లిదండ్రులు అండగా వున్నారన్న ధైర్యం, తోబుట్టువులు వున్నారనే ధైర్యం, పిల్లలు వున్నారనే ధైర్యం, మేనమామలు, పినతండ్రులు, బంధువులు యిలా ఎందరో అండగా వున్నారనే ధైర్యం వుండేది. ఏ శుభకార్యమొచ్చినా, ఆపద వచ్చినా అందరూ లేక ఏ కొందరైనా ఏదో ఒక విధంగా అండగా నిలిచేవారు. ఉదాహరణకు ఒక ఇంట్లో పెండ్లి వస్తే సంబంధాలు చూడడం దగ్గరనుంచీ అందరూ పూనుకునే వారు. అలాగే ఎవరైనా మరణించినా అంతే. ఒకరింట్లో తల్లి చనిపోతే పసిపిల్లలుంటే వారిని బంధువులలో తలా ఒకరూ తీసుకెళ్ళి పెంచేవారు. వారు సరిగా చూసారా, లేదా, అన్నది ప్రశ్నగాదు. మేమున్నామనేదే అక్కడ ముఖ్యము. తల్లికి పాలు లేకపోతే ఇంట్లో పసిపిల్లలున్న తల్లులు పాలిచ్చేవారు. లేక దాదులు వుండేవారు. అలాగే మిగతా విషయాల్లోనూ, ఇంట్లో వాళ్ళు, బంధువులు, స్నేహితులు, ఊరి పెద్దలు వారి శ్రేయస్సుకై పాటుపడేవారు. అలాగే వీరు గూడా వారికి సహకరించేవారు.

నేటి పరిస్థితి పూర్తి వేరుగా వున్నది. క్రిందటి తరం వరకూ అరకొరగా వున్న అనుబంధాలు ఈ రోజు పూర్తిగా లేవేమో అనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రతివారూ, “మాకు ఎవరు అవసరం లేదు. ఎవరికీ మేము అవసరం వుండనక్కరలేదు” అనే విధంగా వుంటున్నారు. ఇట్టి స్వార్థపరమైన ఆలోచనలు, ప్రవర్తనల వల్లనే భయం కలుగుతున్నది.

అందుకని ఈ భయాలను నివారించుకోవడానికి చాలామంది దైవాన్నీ, మహాత్ములను ఆశ్రయిస్తున్నారు. వారి అతీత శక్తుల వలన వారు మన భయాలను తొలగిస్తారేమోననే ఆశ. అందువలన కొన్ని సమస్యల భయం తొలగినా పూర్తిగా నిర్భయులుగా వుండలేకపోతున్నారు. అందుకు కారణం అధర్మం పెచ్చుపెరగడమే. ఈనాడు అధర్మం ప్రపంచ మంతటా అనేక విధాలుగా విలయతాండవం చేస్తున్నది. దాని పర్యవసానమే అంతులేని భయం.

కొందరు భగవంతుని, మహాత్ములను ఆశ్రయించి గూడ అధర్మ ప్రవర్తకులై వుంటున్నారు. కొంతమంది ధర్మం ప్రకారం నడుద్దామనుకున్నప్పటికీ సమాజానికి ఎదురీతకు భయపడి తల ఒగ్గవలసి వస్తుంది. ఇతరులు అధర్మ ప్రవర్తకులయినప్పుడు భయం కలగడం సహజమే గానీ, ధర్మం ప్రకారం నిలబడే ధైర్యం కలిగివుండాలి. మన ధర్మం మనలను కాపాడుతుంది. “ధర్మో రక్షతి రక్షితః” “ధర్మాన్ని రక్షిస్తే, ధర్మం రక్షించిన వాడిని రక్షిస్తుంది” అని పెద్దల వాక్యం. కనుక ధర్మాన్ని అంటిపెట్టుకున్న వాడికి ధర్మం వుంటుంది, వుండాలి. మనం ధర్మంగా వున్నా అవతలివాడు అధర్మంతో మనలను మోసం చేస్తున్నాడు, అన్యాయం చేస్తున్నాడు. ఇంకా ఏమైనా చేయడానికి వెనుకాడడం లేదు కదా! మరి మనకు ధైర్యం ఎలా వుంటుంది? అని కొందరనవచ్చు.

సమాజంలో ధర్మాన్ని నిలబెట్టడానికి ఎంతో మంది కృషి చేసారు. ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. కానీ వాళ్ళు ధైర్యాన్ని సడలుకోలేదు. ఉదాహరణకు గాంధీ మహాత్ముడినే తీసుకుంటే స్వతంత్రానికై జీవితాంతం కృషి చేసారు. ఆనాడు ఆయన అలా అనుకుని వుంటే స్వతంత్రాన్ని సాధించగలిగేవాడా? ఆయన చేసేది తప్పుగాదని, ధర్మమనీ ఆయనకు తెలుసు! అంతేగాదు, ఆయన ననుసరించి కొన్ని కోట్లమంది ధర్మయుతమైన పోరాటం సాగించారు. ఆ పోరాటంలో ఎందరో ప్రాణాలను సైతం కోల్పోయారు. అయితే ఆనాడు అంతమంది ఎలా ప్రతిస్పందిచారు? మనిషికి అన్నింటికంటే ఎక్కువదైన ప్రాణభీతిని సైతం వారెలా అధిగమించగలిగారు! దానికి కారణం అలా చేయడమే శ్రేయస్కరమని వారికి తెలుసు గనుక.

ఆనాడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ముస్లిము ఫకీరుయైన శ్రీ శిరిడీ సాయినాథుని తత్త్వాన్ని గూర్చి ప్రచారం చేయడంలో ఎన్నో ఇబ్బందులను, ఎంతో

వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆనాడు ఆయన భయపడి వుంటే ఈనాడు మనం సాయిని యింతగా సేవించి శ్రేయస్సుకు పొందగలిగేవాళ్ళమేనా? ఈ ఒక్క విషయం ఆలోచిస్తే చాలు, ధర్మం యొక్క ఫలితం ఎలా వుంటుందో అవగతమవుతుంది.

అయితే ఈ కాలంలో అధర్మాన్ని ఎదుర్కోగల అంతటి గుండె ధైర్యం మనకున్నదా? అన్నది ప్రశ్న. దానికి సమాధానం 'లేదు' అనే. అయితే మనమేమి చేయాలి? దీనికి పరిష్కారమేమిటి? మనం అధర్మం చేయకపోయినా అధర్మానికి దోహదం చేస్తూవుండవలసినదేనా?

దీనికి పరిష్కారాలు రెండు.

మొదటిది సద్గురువును ఆశ్రయించడం. దానిని మనం చేసాము. అంటే సమర్థ సద్గురువైన సాయినాథుని ఆశ్రయించాము. అయినా అధర్మంలో పాలుపంచుకుంటూనే వున్నాము. అంటే అధర్మాన్ని పరోక్షంగా ప్రోత్సహించిన వాళ్లమవుతున్నాము. దోహదం చేస్తున్న వాళ్ళమవుతున్నాము. అభయప్రదాత అయిన సాయిని ఆశ్రయించిగూడ సాటి మానవుల పట్ల భయంతో అధర్మానికి దోహదం చేయడంలో అర్థమేముంటుంది? "అయితే అట్లా వుంటే ప్రపంచంలో బ్రతకలేముకదా! శ్రీ సాయి అన్ని సమస్యలను తీర్చడం లేదు గదా!" అని అనిపించవచ్చు. నిజమే. ధర్మం కోసం నిలబడడంలో కొన్ని ఇబ్బందులు పడవలసిరావచ్చు. కానీ ధర్మంలో ధైర్యం వుంది. సంతృప్తి వుంది. ఆనందం వుంది. అందుకే ఆనాడు ధర్మవర్తనులైన పాండవులు అడవులపాలై కష్టాలు పడినా సంతృప్తిగా, ఆనందంగా వుండగలిగారు. అధర్మపరులైన ధుర్యోధనాదులు రాజ్యభోగాలు అనుభవిస్తున్నప్పటికీ అశాంతితో కుతకుతలాడిపోయారు. ధర్మరాజాదులు అడవులలో ఆకులలములు తింటూ అలమటించిపోయారని మనమనుకుంటాము. కానీ ధర్మం ముందు తినేది ఆకులలములే అయినా సంతృప్తినిచ్చాయి. వారి దురవస్థకు వారు కుమిలి పోలేదు. క్రోధంతో ఉడికి పోలేదు. కర్తవ్య నిర్వహణకు ఎప్పుడూ సంసిద్ధులై వున్నారు. వారే గాదు, సంఘసంస్కర్తలందరూ సమాజంలో ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. అలాగే నిజమైన భక్తులు గూడ అంతే. లక్ష్యం కోసం, ధర్మం



కోసం ప్రాకులాడడంలో వారు ఏమి తిన్నామనిగాని, ఏమి కట్టుకున్నామనిగానీ, ఎక్కడ వున్నామని గానీ అనుకోరు. ఆహారం తీసుకున్నామని, వస్త్రాలు ధరించామని, ఆచ్ఛాదన క్రింద వున్నామనీ అనుకుంటారు. అందుకే సంతృప్తిగా వుంటారు.

అట్లా అని ఎవరితోనూ తగవుపెట్టుకోమని గాదు. మనకున్న పరిధిలో, మనకున్న శక్తితో, మనకున్న అవకాశాలతో ధర్మం కోసం పాటుపడాలి. అప్పుడు బాబా మనకు అండగా వుంటారు. 'నా భక్తుల సత్సంకల్పాలు నేను నెరవేరుస్తాను' అని బాబా అభయమిచ్చివున్నారు. ఇంతటి సత్సంకల్పం మనకు కలిగి ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన ఎందుకు రక్షించరు? ఆనాడు పాండవులకు శ్రీ కృష్ణుడు అండగా నిలవలేదా? వారు అత్యవసర పరిస్థితులలో, అవసరమైన విధంగా మన వెంట వుండి రక్షిస్తూ నడిపిస్తూవుంటారు. దీనిని గుర్తుపెట్టుకుని మనం ధర్మాచరణకు ప్రయత్నం చేయాలి.

దీనికి రెండవ పరిష్కార మార్గం 'సమైక్యత'. అధర్మాన్ని పోషించకుండా వుండాలంటే సమైక్యత కావాలి. అయితే ఎవరికి వారే అన్నట్లు వుండే ఈ రోజుల్లో సమైక్యత సాధించేదెలా? ఈ సృష్టిలో దేనికైనా పరిష్కారమార్గముంటుంది. 'మనసుంటే మార్గముంటుంది' అన్నది సామెత. మనం హృదయపూర్వకంగా ధర్మబద్ధంగా జీవించాలని సంకల్పించి ఆచరణ ప్రారంభిస్తే మనలాంటి వాళ్ళు మనకు తోడుగా తప్పక నిలుస్తారు. సన్నని దారాలే పేనినప్పుడు పెద్ద త్రాడుగా అయినట్లు సమైక్యత వల్ల సాధించలేనిదేదీ వుండదు. ఆనాడు స్వతంత్రోద్యమంలో పోరాడినపుడు ఆ సమైక్యతే పనిచేసింది. ఆంగ్లేయులను వెళ్ళగొట్టింది. అదే సూత్రం ఇక్కడ మనం పాటించాలి.

ఉదాహరణకు పాలలో కల్తీ జరుగుతున్నదని మనకు తెలుసు, కల్తీ చేయడం అధర్మమనీ తెలుసు. గేదెలకు హార్మోను ఇంజక్షన్లు యివ్వడం వల్ల ఆ పాలు త్రాగినందువలన హార్మోన్లలో సమతుల్యత లోపించి నేడు పసిపిల్లలకు సైతం ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. కనుక అధర్మాన్ని అధిగమించాలనుకున్న కొందరం కలిస్తే మనలో పాడి చేయడం తెలిసినవారి దగ్గరనుంచి, స్వచ్ఛమైన పాలను పొందవచ్చు. అలాగే కూరగాయలు మొదలైనవి. అనారోగ్యకరమైన సింథటిక్ దుస్తులకు బదులు చేనేత దుస్తులను ధరించవచ్చు. అందువలన చేనేత కార్మికులకు కొందరికైనా ఉపాధి కల్పించిన వారముగూడ అవుతాము. కలుషితమైన, నిల్వవుండడానికి ఉపయోగించే రసాయన పదార్థాలు కలిసిన తినుబండారాలను కొనుక్కోకుండా ఇంట్లోనే మంచి తినుబండారాలని తయారుచేసుకోవచ్చు. లేక అట్లా తయారు చేసేవారి వద్ద కొనుక్కోవచ్చు. అలానే హోమియో వైద్యం నేర్చుకోవచ్చు. ఆయుర్వేదంలోని యెన్నో చిట్కాలతో చిన్న చిన్న వ్యాధులను నివారించుకోవచ్చు. దాని వలన ప్రతి చిన్నదానికి ఆస్పత్రులకు పరుగెత్తవలసిన అవసరం వుండదు. అందువలన డబ్బు ఖర్చు గూడ తగ్గించుకోవచ్చు. మన పెరట్లోనే మనకు అవసరమైన చిన్న చిన్న మొక్కలను పెంచుకోవచ్చు.

మన పిల్లలకు మనమే పాఠాలను చెప్పుకుని సరైన విద్యను అందించవచ్చు. నేటి సమాజంలో పెచ్చు పెరుగుతున్న అశ్లీల సాహిత్యము, వెర్రితలలు వేస్తున్న ఫ్యాషన్లు, నైతికంగా ప్రక్కదారి పట్టిస్తున్న సినిమాలు, నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు – వీటి పర్యవసానాల గురించి వివరించి చెప్పి మన పిల్లలను ఉత్తమ వ్యక్తిత్వం గలవారిగా తీర్చిదిద్దుకోవచ్చు. మన పిల్లలకేగాక సాటివారిని గూడ అధర్మం వలన వచ్చే పర్యవసానలేమిటో తెలియజెప్పి ధర్మప్రవర్తకులుగా మలచడానికి ప్రయత్నించవచ్చు. ఇలా చిన్నవాటితో ప్రారంభించి మనతో సహకరించేవారి సంఖ్య పెరిగిన కొద్దీ క్రమంగా బృహత్తర కార్యక్రమాలను గూడ చేపట్టి విజయం సాధించవచ్చు.

కనుక ముందుగా అధర్మప్రవర్తన ఎందుకు సరియైనది కాదో తెలుసుకోవాలి. అధర్మం పట్ల స్పష్టమైన అవగాహన కలిగివుండాలి. ఖచ్చితమైన వ్యతిరేకత ఏర్పరచుకోవాలి. ధర్మం కోసం నిలబడే మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని అలవరచుకోవాలి. అధర్మప్రవర్తకులు తాము చేసేపని ఎంత నీచమైనదైనా, దాని పర్యవసానాలు ఎలా వుంటాయోనన్న భయము, లజ్జ లేకుండా చేయగలుగుతున్నప్పుడు ధర్మం కోసం మనమెందుకు భయపడుతున్నాము! ఇది ఆలోచించాలి.

అందుకు మనం చేయవలసినదల్లా పైన చెప్పుకున్న విధంగా సమైక్యత కలిగి వుండడము. ధర్మరక్షకుడు అయిన సాయి మన వెంటవుండి నడిపిస్తారన్న ధైర్యం కలిగి వుండడం. ధర్మం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు సాయి అవసరమైన సమయంలో అవసరమైన విధంగా కాపాడుతారు అన్న విశ్వాసం కలిగివుండడం. వీటినన్నింటిని సాటివారికి తెలియజెప్పి వారిని గూడ ధర్మ ప్రవర్తకులుగా చేయడానికి ప్రయత్నించడం.

అభయప్రదాత అయిన సాయి వుండగా మనకు భయమెందుకు!

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా వీటిని మనం అలవరచుకుని ముందుకు సాగడమే దీక్షగా పెట్టుకుందాము. మనలను ఈ మార్గంలో చేయిపట్టి నడిపించమని శ్రీ సాయినాథుని, పూజ్యశ్రీ మాస్టరుగారినీ మనసారా ప్రార్థిద్దాము.

# ఇహపరంబుల నొసగునట్టి గురుదంపతుల లీలా కళ్యాణ వైభవం!

*( గత సంచిక తరువాయి)*

***శ్రీమతి టి. పద్మావతి***

అనంతరం పూజ్యశ్రీ అమ్మగారిని, మాస్టరుగారిని తదుపరి వినోద కార్యక్రమం చూడటానికి వీలుగా ఆసీనులను చేశారు. శ్రీమతి వేదమ్మగారికి నృత్యం నేర్పిన శ్రీ సుబ్రహ్మణ్యంగారి బృందంతో నృత్య ప్రదర్శన కార్యక్రమం మొదలయ్యే ముందు, సుబ్రహ్మణ్యంగారి శిష్యురాలైన శ్రీమతి శివకుమారిగారి శిష్యురాలు, అభ్యుదయ నాట్యకళాకారిణి శ్రీమతి వేదమ్మగారి కుమార్తె చిరంజీవి కైవల్య, ఒక జానపద నృత్యం పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి సేవగా అద్భుతంగా చేసింది. నాట్య గురువుగారు శ్రీ సుబ్రహ్మణ్యంగారు చిరంజీవి కైవల్య నృత్యానికి ముగ్ధులై తను పైన ధరించిన పట్టు వస్త్రాన్ని కైవల్యకి కప్పి అభినందించారు. చిన్నప్పటి వేదమ్మని చూసినట్లు వుందని ఆనందించారు. తదుపరి వారి నాట్య బృందం 'ప్రహ్లాద భక్తి విజయం' అనే యక్షగానం అద్భుతంగా ప్రదర్శించారు.

ఆ యక్షగానం గురించి శ్రీమతి వేదమ్మగారు మాట్లాడుతూ,,,"నరసింహ అవతారం రామావతారం కంటే ముందుగా ఉంటుంది, దాన్ని త్యాగరాజ స్వామి రాముడి పరంగా ప్రహ్లాద భక్తిని వర్ణించడం దాన్ని సుబ్రహ్మణ్యం మాస్టరుగారు తీర్చిదిద్దిన తీరు అద్భుతంగా ఉంది. ఇక్కడ మా అందరికీ ఇంతటి సత్సాంగత్యాన్ని, భక్తిని తిరిగి పునరుజ్జీవనం చేసినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు" అని చెప్పారు. శ్రీ ద్వారకనాథ్ గారు మాట్లాడుతూ, "ఒక చిత్రమైన రహస్యాన్ని త్యాగరాజస్వామి ఇందులో ఇమిడ్చారు. ప్రతి యోగి ధ్యానంలో వాడుకునే ముద్రా శాస్త్రం సముద్రుడు. గరుత్మంతుడు దేనికి చిహ్నమంటే యోగులందరూ శ్వాస, ప్రాణాయామం చేసే సాధనకు చిహ్నం. ఈ రెండు చేస్తే భక్తుడికి హృదయంలో ధ్యానం వల్ల కలిగే ఆనందం కలుగుతుంది. దాని పేరు రాముడు. అందుకని ప్రహ్లాదుని రక్షించింది రాముడిగా వివరించారు త్యాగరాజస్వామి. ఇంతటి యక్షగానాన్ని అమ్మగారు మాస్టరుగారి ముందు ప్రదర్శించిన సుబ్రహ్మణ్యంగారికి మరింత కృతజ్ఞతలు" అంటూ శ్రీకాంత్ గారిచే నాట్య గురువు గారికి శాలువకప్పి సత్కరించారు. బృందంలో పాల్గొన్న కళాకారులందరికీ, శ్రీమతి వేదమ్మగారి చేతుల మీదుగా పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రసాదము అందచేశారు. అంతటితో ఆరోజు కార్యక్రమాలు ముగిసాయి.

## మార్చి 6, కళ్యాణమహోత్సవం!

ఆ రోజు పూజ్య అలివేలుమంగాభరద్వాజుల కళ్యాణమంటపం ప్రత్యేక అలంకరణతో నూతన శోభను సంతరించుకుంది. సీతారాముల కల్యాణాన్ని వీక్షించడానికి రామచిలుకల దండు అందరికంటే ముందుగా వేదికనలంకరించాయి. మంటపమంతా రకరకాల పూమాలలు, గుత్తులు గుత్తులుగా అలంకరించబడి వాటి మధ్యలో రామచిలకలు చిరుగాలికి వయ్యారంగా ఊగుతూ పైనుండి కళ్యాణం వీక్షించడానికి సందడిచేస్తున్నాయా అన్నట్లు అలంకరణ శోభిల్లింది. వేదికకు అటూ ఇటూ మహాత్ములకు ఉచితాసనాలు ఏర్పాటు చేశారు. మధ్యలో సమర్థ సద్గురు సాయినాథునికి, వారికి ఇరువైపులా వధూవరులకు ఆసనాలు అమర్చారు. ఇక కొంతసేపట్లో కళ్యాణం మొదలవుతుందనగా శ్రీ ద్వారకనాథ్ గారు మాట్లాడుతూ,,,,

"ముందుగా గణపతి పూజ జరుగుతుంది. గణపతి గురించి ఒక ముఖ్య విషయం మీతో పంచుకుంటాను.

మీరు ఒక దీపం పెట్టుకొని అది కదలకుండా ఉన్న గదిలో కూర్చుని, కొంచెం చెయ్యి తడుపుకొని నాభి కింద చేయి పెట్టుకొని, దీపం మీద దృష్టి కేంద్రీకరించి కూర్చుంటే దాంతోపాటు శ్వాసను గమనిస్తూ ఉంటే మీ శ్వాస బొడ్డు దాకా వచ్చి మీ చేతిని తగలడం మీకు తెలుస్తుంది, అచ్చం తొండం లాగా! ధ్యానస్థమైన ప్రతి వ్యక్తి స్థితి గణపతి. ఎంత లోతుగా ధ్యానస్థమైతే అంత లోతుగా అతని ప్రాణశక్తి, అతని శరీరము, అతని మనసు గణపతికి ఇచ్చిన వివరణకు సరిపోతాయి. అందరూ అలాచేస్తే అందరిలోనించి గణపతి తత్వం పనిచేసి విఘ్నాలు లేకుండా కార్యక్రమం సరిగ్గా జరుగుతుంది. అంతేకాదు, ఇటువంటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎంతో ఫలితం వస్తుంది. మన పెద్దలు వెయ్యి అశ్వమేధయాగాలు చేసిన ఫలితం వస్తుంది అన్నారు. కనుక అందరూ శ్రద్ధ గా పాల్గొనండి. ముందుగా ఈ కార్యక్రమం మొత్తానికి పూర్ణులైన మహనీయులు ఒక్కొక్కరుగా వేదిక దగ్గరికి వేంచేస్తారు. వారిని చక్కగా ఆసీనులను చేసి వారి అనుమతి తీసుకుని పరాత్పరుడైన శిరిడి సాయినాథులవారిని జయ జయ ధ్వానాలతో ఆహ్వానించుకుందాము. తరువాత వారి అనుమతి కూడా పొంది, అప్పుడు పెళ్ళికూతురిని, పెళ్ళికొడుకుని తీసుకొచ్చి కార్యక్రమం మొదలుపెడదాం" అని చెప్పారు.

నామం జరుగుతూ ఉండగా, మంగళ వాయిద్యాలు మారుమ్రోగుతుండగా మహాత్ములందరూ వేదికనలంకరించారు. వారి వెనుకే శిరిడి సాయినాథులు, వారి వెనుకే శ్రీసూక్తం, పురుషసూక్తం పఠిస్తుండగా పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె వేదికనలంకరించారు. మహాత్ములందరినీ పూలమాలలతో అలంకరించి చల్లటి పానీయములనిచ్చి సత్కరించారు. ఇక కళ్యాణ మహోత్సవం మొదలైంది. ముందుగా వశిష్ఠుల వారి స్థానంలో ఉన్న బాలసుబ్రహ్మణ్య శర్మగారు గణపతి పూజ ప్రారంభించారు. తరవాత పుణ్యాహవచనం జరిగింది. ఆ పవిత్రజలాలను అక్కడున్న వారందరికీ సంప్రోక్షణ చేసినప్పుడు "మనందరికీ మహర్షులందరూ ఇచ్చిన ఆశీస్సులు ఆ జలాలలో ఉన్నాయి, కనుక శ్రద్ధగా శిరసా ధరించ" మని శ్రీ ద్వారకనాథ్ గారు చెప్పారు. తరువాత వివాహఘట్టం మొదలయ్యింది. మొట్టమొదట పెళ్ళికుమారునికి, పెళ్ళికుమార్తెకి భాసిక ధారణ జరిగింది. "ఆ మంత్ర సహిత భాసికాన్ని వారు ఫాల భాగంలో ధరించడం వల్ల మనందరి పెళ్లిళ్లలో మనం ధరించే భాసికానికి ఫలితం వస్తుంది." అని వివరించారు శ్రీ ద్వారకనాథ్ గారు.

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులకు, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి రక్షాబంధన, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరిగింది. "మనం నిద్రపోతే శ్వాస ఆడేట్టు, గాయమైతే అతుక్కుపోయేట్టు ఇలా నిరంతరం మనల్ని రక్షించే దేవతలు రక్షాబంధన దేవతలు. వారు అయ్యవారిని అమ్మవారిని చేరి, మీ అందరినీ రక్షించే వారి బాధ్యతలకు ప్రతీకలుగా మేము నిలిచి వారిని సేవించుకుంటాం అని చెప్పి వారిని చేరుకున్నారు. అవే మనకు ఆశీస్సులని తలచి మనందరం వారికి నమస్కరించుకుందాం. వివాహము అంటే ధర్మార్థకామాలను సంపూర్ణంగా సాధించుకొనుటకు నిర్వహించే యజ్ఞం. వారి కళ్యాణం లోక కళ్యాణం, దానికి ఉపక్రమించబోతూ వారు యజ్ఞ ఉపవీతం ధరించారు. మనందరి నమస్కారాలందుకున్న ఆ ఉపవీతాలు వారి హృదయంపై ఉండి, త్రికాలాలలోనూ, మనల్ని రక్షించే యజ్ఞాన్ని వారికి గుర్తుచేసే బ్రహ్మసూత్రం అది. యోగ పరిభాషలో గురువుగారు శిష్యులను కనికరించాలనే ప్రార్థనకు సంకేతం ఆ బ్రహ్మసూత్రం", అని వివరించారు శ్రీ ద్వారకనాథ్ గారు.

తరవాత వధూవరుల ప్రవరలు చదివి వారిని స్తుతించుకున్నారు. తదనంతరం పరాత్పరుడికి పాదుకాపూజ జరిగింది. వరుడికి బటువు, పట్టువస్త్రాలు; వధువుకి పట్టువస్త్రాలు సమర్పించారు.

తరువాత తెరసెల్లా అడ్డుపెట్టి,,,లీలా కళ్యాణ సందర్భంగా మహా సంకల్పం అందరిచేతా చెప్పించి, పూజ్యశ్రీ అమ్మగారి చేతిలో కొబ్బరిబోండం ఉంచి, అయ్యవారి చేతిలోపెట్టి, దానిపై పాలధారలు, శుద్ధ జలములతో అభిషేకిస్తూ కన్యాదానం చేశారు. తరవాత జీలకర్ర – బెల్లం, సుముహూర్త కార్యక్రమం.

ఆ సందర్భంలో శ్రీ ద్వారకనాథ్ గారు,,,"ఈ క్షణంలో నిజంగా పూజ్యశ్రీ మాస్టరుగారినీ, అమ్మగారినీ మీరు

మనసులో స్మరించగలిగితే లౌకికము ఆధ్యాత్మికం అన్న రెండు భావాలు ఉండక, జీవితం మొత్తం వారి ప్రసాదంగా నడిచిపోతుంది. వారిని మనసులో స్మరిస్తూ శ్రద్ధగా ఈ కార్యక్రమాన్ని వీక్షించవలసింది" అని అందరినీ హెచ్చరించారు.

అనంతరం వధూవరుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ధారణ జరిగింది. "గింజలుగా ఉన్న జీలకర్ర సంకల్పాలకి, బెల్లం ఫలితానికి, సంకేతం కనుక ఆరెండు కలపడం ఒక యోగ ప్రక్రియ. ఈక్షణం నించి ఇరువురు ఉండరు, ఒకరే!!" అంటూ శ్రీ ద్వారకనాథ్ గారు వివరించారు.

తరవాత కార్యక్రమం మంగళసూత్రధారణ. మంగళసూత్రాలకు పూజ అనంతరం, భక్తులందరికీ దర్శింపచేసి, పూజ్యశ్రీ అమ్మగారి మెడలో అలంకరింపచేశారు.

"రెండు సూత్రాలకు అర్థం,,, ఒకటి ప్రకృతి ప్రసాదించిన సంతాన శక్తి, వంశాభివృద్ధికి చిహ్నం రెండవది భర్త ఆచరించే యజ్ఞమయ జీవితంలో సంపూర్ణ సాహచర్య దీక్షకు సంకేతం. ఇక, భర్త తాను చేసే యజ్ఞ కార్యంలో ఫలితం సగభాగం ఆమెకి సంక్రమిస్తుంది. ఇది సృష్టి మొత్తానికి శుభం కనుక ఆ మాంగల్య దేవతకి పూజ చేసి ఆమె మెడలో ధరింప చేసాము" అంటూ వివరించి, "ఇప్పుడు అక్షతారోహణము,,,అంటే ఎన్నాళ్ళకు తరగని మంత్రపూరిత సంకల్పాలు. ఈ శుభ సంకల్పాలని భార్యాభర్తలు ఒకరికొకరు పోసుకుంటారు. కానీ మన గురుదంపతులకు వేరే సంకల్పాలేముంటాయి? మనల్ని చల్లగా కాపాడటమే వారికున్న శుభ సంకల్పాలు. అవే మనకు ఆశీస్సులు!" అంటూ తలంబ్రాలకి అర్థం చెప్పారు శ్రీ ద్వారకనాథ్ గారు. కన్నులపండుగగా జరిగిన తలంబ్రాల కార్యక్రమం అనంతరం నల్లపూసలు, మట్టెలు ధరింపచేశారు. తరవాత మాలాపరివర్తనం.... మంగళహారతి.

మంగళం జయ మంగళంబనరే
గురు దంపతులగు శ్రీభరద్వాజ మంగాంబలకు...

అంటూ శ్రీమతి వేదమ్మ శ్రీమతి లయమ్మ ఆలపించగా...శ్రీ ద్వారకనాథ్ గారు మంగళహారతి సమర్పించారు.

ఈ సంవత్సరం లీలా కళ్యాణ కార్యక్రమానికి ముగింపు పలుకుతూ, "ఈ లీలా కళ్యాణ ప్రాశస్త్యాన్ని మరొక్కసారి వివరించి, ఇది సత్యనారాయణస్వామి వారి వ్రతంలాగ, ప్రతి వారూ తమ ఇంటిలో చేసుకోవచ్చు. ఇంత వైభవంగా చేసుకోవాలన్న నియమం ఏమీ లేదు. ఎంత వీలైతే అంత చేసుకోవచ్చు. చివరికి పూజ్యశ్రీ అమ్మగారు, మాస్టరుగారి పటాలు పెట్టుకుని పూలమాలలు వేసుకుని పూజ చేసుకున్నా చాలు. అంతే ఫలితం ఉంటుంది. శ్రద్ధ ముఖ్యం. ఇలా చేసుకోగలిగితే లీలా కళ్యాణ ప్రభావం వల్ల అక్కడివారందరికి ఎన్నో శుభాలు కలుగుతాయి. ఇప్పుడు అందరూ గురు దంపతులకు నమస్కారం చేసుకుని ప్రసాదం తీసుకుని వెళ్ళవలసింది" అని చెప్పి ముగించారు.

## మార్చి 6వ తేదీ సాయంత్రం

శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్ వారిచే "శ్రీ అలివేలుమంగా భరద్వాజ గురుదేవుల లీలా కళ్యాణం" కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఆరంభించడానికి ముందు, శ్రీ ద్వారకనాథ్ గారు మాట్లాడుతూ,,, "ఈవిశ్వం మొత్తం నడిపే అయ్యవారు, పూర్ణ శక్తి స్వరూపిణి అమ్మవారు– ఇద్దరూ ఈరోజు కళ్యాణం చేసుకున్నారు. వీరిద్దరిలో రెండురకాల స్పష్టత. ఒకటి పరాక్రమం, రెండు మొక్కవోని విశ్వాసం. అంతటివారు మన మధ్యన ఉండి కోరికలు కష్టాలు తీర్చుకునే విధానం, కర్మను క్షాళన చేసుకునే విధానం ఇవన్నీ ప్రసాదిస్తున్నారు. దాన్ని కరుణ అంటారు. అంతటి వారి లీలా కళ్యాణాన్ని వారికే వినోదార్థం ప్రదర్శించడానికి నృత్యకళాకారులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు కొద్ది సేపట్లో 'నృత్యం దర్శయామి' అని వారు సేవ చేసుకుంటారు. దాన్ని తిలకిద్దాం. ఈరోజు కార్యక్రమంలో ఒక స్వీట్ సర్ప్రైజ్ ఉంది (sweet surprise). అందరూ శ్రద్ధగా తిలకించండి" అంటూ తమ ప్రసంగాన్ని ముగించారు.

అత్యద్భుతంగా నృత్య ప్రదర్శన జరిగింది. ప్రదర్శన అనంతరం నళినీప్రియ నృత్య నికేతన్ నిర్వహించే శివకుమారి గారు, శ్రీమతి వేదమ్మ పూజ్యశ్రీ మాస్టరు గారి పాత్రలో అభినయం చేశారని, తిరిగి పూజ్యశ్రీ మాస్టరుగారిని చూసినట్టే ఉందని చెప్పడంతో, సభ

అంతా కరతాళధ్వనులతో మారుమ్రోగింది. శ్రీ బాబుగారు అన్నట్లు అది నిజంగాస్వీట్ సర్ప్రైజ్ అందరికీ!! తరవాత అందులో పాల్గొన్న ఒకొక్కకళాకారిణికి సర్టిఫికెట్స్ ఇచ్చి సత్కరించారు శ్రీ ద్వారకనాథ్ గారు. తదుపరి గురుదంపతులకు మంగళహారతిచ్చి ఆరోజు కార్యక్రమానికి ముగింపుపలికారు.

## మార్చి 7,8 వ తేదీ కార్యక్రమాలు

మార్చి 7వ తేదీ ఉదయం "మహాత్ములు చెప్పిన మార్గం ఏమిటి? అందులో పయనించడం ఎలా?" అనే అంశాన్ని వివరిస్తూ రోజంతా చర్చించారు ద్వారకనాథ్ గారు. నిర్దుష్టమైన ఆధ్యాత్మికత యొక్క ప్రాముఖ్యత, అనేక సాంప్రదాయాల బోధలు వినడం వల్ల కలిగే సంశయాలను ఎలా రాకుండా చూసుకోవాలో, పారాయణ మొదలైనవి ఎంత ముఖ్యమో, పరిపూర్ణత కలుగకముందు ఎంతటి వారికైనా ఎటువంటి సామాన్య భావాలు కలిగే ప్రమాదం ఉన్నదో, సత్సంగాలు నిర్దుష్టంగా ఎలా చేసుకోవాలో – ఇలా ఎన్నో విషయాలు వారు చర్చించారు. నిర్దుష్టమైన ఆధ్యాత్మికతకు పూజ్య సాయినాథులు, పూజ్య మాస్టరుగారు ఎలా ప్రధాన సూత్రధారులో ఎన్నో ఉదాహరణలతో వివరించారు. వ్యక్తులు, వ్యక్తిగత అభిప్రాయాలు, అనుభవాలను తగు మాత్రంగానే పరిగణించాలని పూజ్య మాస్టరుగారి రచనలను మాత్రమే మూలప్రమాణాలుగా చూసుకొని వాటితో సరిపోయే భావాలను, ఆచరణను మాత్రమే అవలంబించాలని, ప్రోత్సహించాలని ఎన్నో జాగ్రత్తలు చెప్పారు శ్రీ ద్వారకనాథ్ గారు.

## మార్చి 8వ తేదీ సత్సంగము!!

"ఉదయం, "సాధనా పద్ధతులు,,విధానము,, జాగ్రత్తలు" అనే అంశాలపై శ్రీ ద్వారకనాథ్ గారు సత్సంగం చేస్తూ... "పారాయణ బాగా జరగాలంటే, 'సామర్థ్యం వారిది సేవించుకునే అవకాశం మనది' అని గుర్తుంచుకోవాలి. మనకి మన శరీరభాగాల దగ్గర నించి అన్నింటినీ వారే మనకు ఇచ్చారని, వారి దయవల్లనే మనకీ అవకాశం వచ్చిందని గుర్తుండాలి. పారాయణ సరిగ్గా జరగాలంటే మిగతా చోట కూడా సరిగ్గా ప్రవర్తించాలని తెలియాలి. మనసు శరీరము వాటి స్థితి ఎలా ఉంటే పారాయణ బాగా జరుగుతోందో మనమే గుర్తించాలి. అలా రోజూ ఉండేటట్టు జీవితాన్ని క్రమంగా మలుచుకోవాలి. ఎలాంటివి తింటే పారాయణ బాగా సాగిందో– మొదలైనవి గమనించి వినియోగించుకోవాలి. పారాయణ పూర్తయ్యాక అప్పటిదాకా చదివిన లీలలు స్మరించుకోవాలి. మర్చిపోతే వారిని క్షమించమని అడగాలి. అలాగే పారాయణ పూర్తవ్వగానే గబుక్కున లేవకుండా వారికి కృతజ్ఞతలు చెప్పుకుని లేవాలి. పారాయణ బాగా సాగిన కొద్దీ రోజంతా హాయిగా ప్రశాంతంగా ఉంటుంది."

## నైవేద్యము

"వారిది వారికి వండిపెట్టే సేవ అని గుర్తుండాలి. షాపులో సరుకులు కూడా ఆయనవే అనే భావన ఉండాలి. వంట చేసేటప్పుడు, భగవంతుని తత్వము, కృతజ్ఞత, సేవాభావం, శ్రద్ధ మొదటగా గుర్తురావాలి."

### కాకబలి

"సర్వమూ భగవంతునిదేనని, వారిదే వారికి సమర్పిస్తున్నాము అన్న ఎరుక కలిగి సమృద్ధిగా సమర్పించాలి. ఎప్పుడు ఎవరికి భోజనం పెట్టినా బాబాకి పెట్టినట్టుగా పెట్టాలి. దత్తస్వామి భిక్షాపరుడు,,,ఇంట్లో తినేవారు కూడా వారి రూపాలే అన్న భావన ఉండాలి."

## పూజ, హారతులు

"రోజూ పంచోపచార పూజ అయినా చేసుకోవాలి. హారతులు తప్పకుండా చేసుకోవాలి. పూజలో ఉపచారాలు చేసే ప్రక్రియలో, మనసు పక్కకి పోతుంటే,,,ఒకొక్క ఉపచారము ప్రత్యేకంగా భావన చేస్తూ శ్రద్ధగా చెయ్యాలి. అంటే కొన్ని రోజులు ధూపం సరిగ్గా ఇవ్వడం సాధన చెయ్యాలి. తరవాత దీపం.,,ఇలా అన్ని ఉపచారాలు శ్రద్ధగా చేయడం వచ్చే వరకు ప్రయత్నించాలి. మానసిక పూజ అన్నిటికన్నా శ్రేష్ఠమైన సాధన"......అంటూ తన సత్సంగాన్ని ముగించి, లీలా కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలకు స్వస్తి వాక్యం పలికారు శ్రీ ద్వారకనాథ్ గారు.

# వార్తాలాపము

( గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 16వ ప్రసంగము

### అధృతి

మానవుడు చేసే ప్రతి పనిలోనూ దృఢత్వాన్ని కలుగచేసే ప్రయత్న విశేషాన్ని 'ధృతి' అంటారు. ధృతి అంటే పట్టుదల. మనస్సును, ఇంద్రియాల చేష్టలను (పనులను) అశాస్త్రీయ ప్రవృత్తి నుంచి నివారించేది సాత్వికమైన ధృతి. ఈ సాత్వికమైన పట్టుదల కలిగి వుండడం వలననే హరిశ్చంద్ర మహారాజు ఎన్ని ఆపదలు వచ్చినా స్వధర్మాన్ని విడువలేదు. కర్తృత్వము మొ॥న వాటి అభిమానముతో ధర్మ, అర్థ, కామాల విషయాలలో మాత్రమే కర్తవ్యాన్ని నిశ్చయించేది, మోక్షాన్ని కర్తవ్యముగా భావించనిది రాజసమైన పట్టుదల. ఈ రెండు రకాల పట్టుదల లేకపోవడం అంటే నాలుగు పురుషార్థాలను నిర్ణయించుకోవాలని తలచకపోవడం. ఆ పట్టుదల లేకపోవడమే 'అధృతి' అని శ్లోకంలోని శబ్దానికి అర్థము. దాని చేత భయము, శోకము, మదము మొ॥న వాటికి మానవుడు దూరంగా వుండడు. అటువంటి స్వభావాన్ని 'తామసధృతి' అని కూడా చెప్పవచ్చు.

### క్రౌర్యమ్

తమోగుణము పెరిగినకొద్దీ చేయదగినవి, చేయకూడని పనులనే వివేకాన్ని కోల్పోయి క్రోధము, ద్వేషము మొ॥న గుణాలు ఉధృతమై మానవుడు అన్ని వేళలలోను చేయకూడని పనులలోనే నిమగ్నుడై వుంటాడు. ఇటువంటి వారినే శాస్త్రాలు రాక్షస, పిశాచ అనే పదాల ద్వారా వర్ణించాయి. ఇటువంటివారు ఎల్లప్పుడూ ఇతర ప్రాణులను హింసించి ఆనందాన్ని పొందుతారు. తొర్రలో నిప్పు వున్నప్పుడు చెట్టు పచ్చగా వుండడానికి వీలు వుండనట్లే ఇతరులకు హాని చేయాలనే ఉద్దేశము కలిగిన మనసులలో దయకు స్థానము లేదు.



క్రౌర్యానికి (క్రూరత్వానికి) గుజరాత్ చరిత్రలోని మహారాజైన సిద్ధరాజు జయసింహుని ఉదాహరణ గమనించాలి.

జయసింహుడు ఒకసారి సోమనాథ మహాదేవుని దర్శనం కోసం యాత్రకు వెళ్ళాడు. అతడు మార్గమధ్యంలో సౌరాష్ట్రలోని మనేవాడి గ్రామంలో ప్రారబ్దవశాన 'హడమత' అనే కుమ్మరి ఇంట్లో పెరిగిన రూపవతి అయిన శేఠ్ పావనుని కుమార్తె అయిన రాణకదేవిని చూశాడు. ఆమెను వివాహమాడాలని జయసింహునికి కోరిక కలిగి ఆ కుమ్మరికి తన కోరికను చెప్పాడు. గుజరాత్ మహారాజు, ఎంతో గొప్పవాడైన జయసింహుడంతటివాడు తనకు అల్లుడవుతున్నాడనే ఆనందంతో సిద్దరాజ జయసింహుని కోరికను అంగీకరించి ఆ కుమ్మరి రాణకదేవి వివాహాన్ని నిర్ణయించాడు.

ఈ వార్త జునాగఢ్ రాయ ఖేంగారుకు తెలిసింది. సౌరాష్ట్ర సుందరియైన కుమారికి గుజరాతు రాజు సిద్ధరాజు వివాహం చేసుకోవడం తనకు అగౌరవంగా తోచింది. ఈ విషయం చెప్పి ఆ కుమ్మరిని ఒప్పించి, తన బలపరాక్రమాలపైన, వ్యక్తిత్వము పైన ఆసక్తి కలిగిన రాణకదేవిని వివాహం చేసుకుని రాయఖేంగారుడు జునాగఢ్‌కు తీసుకెళ్ళాడు.

అప్పుడు సిద్ధరాజు తన సైన్యాన్ని తీసుకుని జునాగఢ్ మీద దండయాత్ర చేశాడు. అతనిని రాయఖేంగారుడు పన్నెండేళ్ల పాటు కోటకు బయటనే ఆపేశాడు. కానీ చివరకు రాయఖేంగారుని మేనల్లుళ్ళైన దేశలుడు, విశలుడు సింహాసనం మీద కోరికతో సిద్ధరాజు వైపు చేరారు. వారు శత్రువులకు కోట యొక్క రహస్య మార్గాన్ని తెలిపి ఖేంగారుని చంపించారు.

సిద్ధరాజు కోపంతో సింహద్వారం దగ్గర కాపలా వున్న ముసలివాడైన ద్వారపాలకుని చంపి లోపలకు ప్రవేశించాడు. మొదట చెడ్డవాడైన సిద్ధరాజు రాణకదేవిని చూసి ఆమె తేజస్సుకు హడలిపోయాడు. కానీ వెంటనే ఆ తేజస్సును పట్టించుకోకుండా ఆమెను చేజిక్కించుకోవడానికి ముందుకు నడిచాడు. అంతేకాదు ముక్కుపచ్చలారని ఆమె కొడుకులిద్దరిలో ఒకడిని కత్తితో రెండుముక్కలు చేశాడు. మరొకడిని ఆవేశంతో కాలితో నలిపివేసి ప్రాణాలు తీశాడు. ఈ రాక్షసచర్య చూసి మూర్ఛపోయిన పతివ్రత అయిన రాణకదేవిని గుర్రముమీద తీసుకుని తన రాజధాని అయిన పాటణ్ వైపుకు బయలుదేరాడు.

రాణకదేవికి స్పృహ వచ్చిన వెంటనే ఆమె రాయఖేంగారుని కోసం ఏడవడం సిద్ధరాజు గమనించాడు. అది చూసి జయసింహుడు ఆమె తనకు లొంగదని తెలుసుకుని శపిస్తుందేమోననే భయంతో బడవాణు పట్టణం దగ్గర ఆమెను విడిచి వెళ్ళిపోయాడు. రాణకదేవి బడవాణలోని నదీతీరంలో అగ్నిప్రవేశం చేసింది. ఇప్పుడు కూడా ఆమె సమాధి అక్కడే వున్నది.

ఇలా కోపావేశంలో సిద్ధరాజు చూపించిన క్రౌర్యానికి అంతులేదు.

**- సశేషం**

# పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ 37వ ఆరాధనా మహోత్సవం!!

*శ్రీమతి టి. పద్మావతి*

అనంత చైతన్య స్వరూపులైన పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు భౌతిక దేహాన్ని త్యజించి బృందావన ప్రవేశం చేసి ముప్పై ఆరు వసంతాలు పూర్తయిన శుభవేళ గుమ్మళంపాడులో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానంలో 37వ ఆరాధనా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

ఆరాధనా మహోత్సవానికి కొద్దిరోజుల ముందుగానే, వేరు వేరు ప్రదేశములనుండి భక్తులు వారిని సేవించుకునేందుకు పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధానానికి చేరుకున్నారు. ముందురోజు నుండి సేవకులందరూ మాతృదేవి నెలకొని యున్న ప్రాంగణమంతా శుభ్రపరచి వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. గురుదంపతులకు మేలుకొలుపుతో సేవలు ప్రారంభమై వరుసగా కాకడ హారతి, కాఫీ నివేదన, ప్రత్యేక మంగళ స్నానం పూర్తయ్యాక, డ్రై ఫ్రూట్స్ తో పూజ్యశ్రీ మాస్టరుగారి మూర్తిని, వారి హృదయనివాసిని పూజ్యశ్రీ అమ్మగారి మూర్తిని సమాధిపై అత్యంత రమణీయంగా అలంకరించారు. అలాగే మాతృదేవి పాదపద్మములను కూడా డ్రై ఫ్రూట్స్ తో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆ పర్వదినాన ఇంకొక ముఖ్యమైన, అద్భుతమైన సంఘటన కూడా జరిగింది. శ్రీమతి మాదిరాజు పద్మావతమ్మగారు అనే భక్తురాలికి చాలా సంవత్సరాల క్రితం, పూజ్యశ్రీ అమ్మగారు సాక్షాత్తూ దత్తాత్రేయస్వామిగా స్వప్నదర్శనం ప్రసాదించారు. పద్మావతమ్మగారు పూజ్యశ్రీ అమ్మగారి అనుమతితో చెక్కతో పాదుకలు చేయించుకుని వారి వద్దకు ఒంగోలుకు తీసుకువచ్చారు. పద్మావతమ్మగారి ప్రార్థనపై ఆ పాదుకలను పూజ్యశ్రీ అమ్మగారు ధరించి ప్రసాదించారు. వారు ఆ పాదుకలను ఎంతో సంతోషంతో తమ స్వగృహంలో నెలకొల్పుకుని చాలాకాలం సేవించుకున్నారు. కాలాంతరంలో ఆ పాదుకలు బాపట్ల సత్సంగసభ్యులకు చేరాయి. ఇంతకాలం వాటిని వారు అత్యంతభక్తిశ్రద్ధలతో పూజించుకుని ఈరోజు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానమునకు ఆ దివ్యపాదుకలను సమర్పించారు.

బాపట్ల సత్సంగసభ్యులు ఆ దివ్యపాదుకలను పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానానికి తీసుకువచ్చిన తీరు అద్భుతం. ఆరాధనకు పది రోజుల ముందు నుండే ఆ పాదుకలను భక్తులు తమ ఇళ్లకు ఆహ్వానించారు. ప్రతిరోజూ నాలుగైదు ఇళ్లలో ఈ పాదుకలను ఉంచి, పూజలు చేశారు. భగవాన్ శ్రీ భరద్వాజ గ్రంథంలోని 'అర్ధాంగి' అధ్యాయాన్ని పారాయణ చేస్తూ, పూజ్యశ్రీ అమ్మగారితో తమకున్న అనుభవాలను పంచుకున్నారు. ఇలా వారం పది రోజుల పాటు నిరంతర సేవలో గడిపి, ఆరాధన నాడు దివ్య పాదుకలను తీసుకుని

సన్నిధానంలోని భక్తనివాస్ చేరుకున్నారు. బాపట్ల సత్సంగ సభ్యులు పూజ్యశ్రీ అమ్మగారి పాదుకలను శిరస్సుపై ధరించి, చీర సారెలతో, భక్తనివాస్ నుండి సన్నిధానానికి తీసుకుని వచ్చారు. శ్రీమతి వేదమ్మగారు ఆ పాదుకలకు 'శ్రీ సాయినాథ పూజ' గ్రంథంలో యిచ్చిన నామావళితో విశేష పూజ చేశారు. పూజ్యశ్రీ మాస్టరుగారి ఆరాధనా మహోత్సవం రోజున పూజ్యశ్రీ అమ్మగారు కొలువైవున్న సన్నిధానమునకు దత్తస్వరూపిణియైన వారి పాదుకల ఆగమనం అత్యంత భవ్యము, దివ్యము, మంగళప్రదము! కనుక అక్కడున్న భక్తులందరి తరపున శ్రీమతి వేదమ్మగారు ఆ దివ్య పాదుకలకు విశేష పూజచేశారు. నామస్మరణ నిర్విరామంగా జరుగుతుండగా బాపట్ల సత్సంగ సభ్యులు తీసుకొచ్చిన నివేదనలన్నీ సమర్పించి, మంగళహారతిచ్చి ఆ పూట కార్యక్రమాన్ని ముగించారు.

తమ నిత్య పూజల కోసం వారు మరొక జత కొత్త పాదుకలను చేయించుకుని, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో ఆశీస్సులు పొంది బాపట్లకు తీసుకువెళ్లారు. అలాగే పామూరు సత్సంగ సభ్యులు కూడా పూజ్యశ్రీ అమ్మగారి మరియు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలను తయారు చేయించుకుని, ఒంగోలులోని బృందావనంలోనూ, గుమ్మళంపాడు సన్నిధానంలోనూ ఆశీస్సులు పొంది తమ ప్రాంతానికి తీసుకువెళ్లారు.

ఒంగోలు లాయరుపేటలో కొలువైవున్న పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనానికి ఆరాధన సందర్భంగా అనేక ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు, ఉదయం పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనం వద్ద ఆరాధనామహోత్సవం పూర్తిచేసుకుని సాయంత్రం పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి దర్శనానికి తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో శ్రీమతి వేదమ్మగారు సత్సంగం చేశారు.

అందులో కొన్ని విశేషాలు...

ముందుగా దత్తస్వామిని, శిరిడి సాయినాథుని, సద్గురు దంపతులను ఎదురుగా వున్న పీఠంపైకి, అందరి హృదయంలోకి సాదరంగా ఆహ్వానించి, అప్పుడు శ్రీమతి వేదమ్మ సత్సంగం మొదలుపెట్టారు .

సమర్థ సద్గురువైన శిరిడీ సాయినాథులు, "ఈ ఆరడుగుల శరీరమే నేను అనుకున్నవారు నన్నసలు చూడనట్లే!' అన్నారు. 'బాబా శిరిడిలోనే వున్నారు, ఇంకెక్కడా లేరు' అనుకునేవారు ఆయన గురించి ఏమి తెలియనివారేనన్నమాట! ఎందుకంటే మహాత్ములందరూ తాము శరీరంతో వున్నప్పుడే శరీర పరిమితులుగా వుండరు. 'మరి శరీరం ధరించి వచ్చినది ఏమిటి?' అంటే...ఏది లేకపోతే అసలు సృష్టి కొనసాగదో, ఈరోజు ఇలా మనందరం ఇక్కడ వుండడం కుదరదో అటువంటి మూలతత్వం తానే అని తెలిసిన మూలతత్వం ఆ ఎరుకతో కేవలం జనులను ఉద్ధరించడానికి శరీరం ధరించి సద్గురువై అవతరిస్తుంది.

బాబా శిరిడీలో వంట చేస్తున్నప్పుడు వేడిగా వున్న గుండిగలో కింద మంట మండుతున్నా చేయిపట్టి కలిపినప్పుడు ఆయన చేయి కాలలేదు. కానీ మనకి వేడి గిన్నె పట్టుకుంటేనే చేయి కాలుతుంది కదా! మరి వారికి, మనకి తేడా ఏంటి? వారు కూడా మనలాగే శరీరం ధరించే వున్నారు కదా? అంటే ... వారు శరీరం ధరించి వున్నా అంతటా, అందరిలోనూ ఎల్లప్పుడూ వుంటారు. కనుక అందరి మనసులలో వున్న విషయాలు బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారిలాంటి మహాత్ములకు తెలుస్తాయని వారి చరిత్ర చూస్తే తెలుస్తుంది. ఈనాటికి పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి అన్నివిషయాలు తెలుస్తాయని మనందరి అనుభవం.

ప్రారబ్ధం ప్రకారం అన్నీ జరిగేటట్లయితే — అంటే మనం ఏం చదువు చదువుతాము, ఎటువంటి ఉద్యోగం వస్తుంది, ఎవరితో పెళ్లి అవుతుంది, మన పిల్లలు ఎలా ఉంటారు, మనకు ఏ కష్టాలు వస్తాయి, ఏ సుఖాలు వుంటాయి...ఇవన్నీ ప్రారబ్ధానుసారం జరుగుతుంటే ఇక వారు మన మధ్యకు వచ్చి చేసేదేమిటి? వారు మనకు ధర్మం బోధించడమెందుకు? అంటే... మనం మన గతాన్ని మార్చుకోలేము కానీ సద్గురు కృప వలన మన భవిష్యత్తును మార్చుకోవచ్చు. వారి మార్గంలో నడిచి మనం భవిష్యత్తును, ఉత్తర జన్మలను ఉత్తమంగా తీర్చిదిద్దుకోగలము. మనం వారు చెప్పింది శ్రద్ధాభక్తులతో

ఆచరించగలిగితే, తగినంత కృషి చేయగలిగితే, మనకు శ్రేయస్సు చేకూర్చేందుకు అవసరమైతే మన చెడు కర్మను తొలగించగలరు, కర్మను మార్చగలరు. కనుక వారిని ఆశ్రయించాలి. మనం శ్రీగురుచరిత్రలో దత్తుడు అనే భక్తుడి ఆయుష్షును మార్చిన లీల చదువుకుంటాం. ఇటువంటి అనుభవాలు ప్రతి మహాత్ముడి చరిత్రలోనూ వుంటాయి. అంతేకాదు, వారు శరీరపరిమితులుగా లేరనే అనుభవాలు కూడా ప్రసాదిస్తారు. మరి అటువంటి అనుభవాలు వారు ఎందుకు ప్రసాదిస్తారంటే, వారు ప్రసాదించిన అనుభవంతో మనం మరింత భక్తిశ్రద్ధలతో భగవంతుడిని ఆరాధించి సన్మార్గంలోకి వస్తామన్న ఒక్క ఉద్దేశంతో మాత్రమే! అంతకు మించి మహాత్ములు ఆశించేదేమీ లేదు.

శరీరం ధరించిన సద్గురువులకు మనలాగే ఆకలి దప్పులు ఉంటాయి, బాధ్యతలు వుంటాయి. అవసరాలు వుంటాయి. కష్టసుఖాలూ వుంటాయి, వయస్సు ధర్మాలు వుంటాయి. అలా లేకుంటే మనమే అంటాం.. 'మీకైతే ఏ కష్టం వుండదు, మాకైతే ఎన్ని కష్టాలో! అందుకనే మేము ఇలా వున్నామని!' మనకున్న సమస్యలు అన్నిటికీ బాబా పరిష్కార మార్గంగా వచ్చారు కదా! ఎలా? అసలు మన సమస్యలకు ఆయన జీవిత విధానానికి పోలిక ఎక్కడ వుంది? బాబా నిత్యసత్యులు, పరిసమాప్తి లేని అవతారం. మనందరం గృహస్థులం గనక, ఆ దత్తస్వామియే పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారి రూపాలలో గృహస్థులుగా అవతరించి సాయి ఎలా మన సమస్యలకు పరిష్కారమార్గమో సూచించడానికి మన మధ్యకు వచ్చారు. మన మధ్య మనలా వుంటూ, ఎన్నో అనుభవాలు ప్రసాదిస్తూనే వారు అంతటా నిండివున్న చైతన్యంతో తాదాత్మ్యం చెంది వుంటారు. అదేసమయంలో శరీరంతో కూడా తాదాత్మ్యం చెంది వుంటారు. అందుకనే వారు సామాన్య మానవులని కొంతమంది, కాదని కొంతమంది అనుకుంటూ వుంటారు. అంటే మనం ఏ విధంగా చూస్తే వారు ఆ విధంగా దర్శనమిస్తారన్నమాట!

ఏకకాలంలో నేను వేరనే భావన, అంతా తానే అన్న భావనా రెండూ కలిసి వుంటాయి వారికి. వారు సృష్టి అంతా వున్న చైతన్యంతో తాదాత్మ్యం చెంది వున్నప్పటికీ, మనకు మాత్రం వారి భౌతికరూపంతోనే సంబంధం వుంటుంది. ఆయన యొక్క తత్వాన్ని భావన చేయడానికి ఆ శరీరం మనకి ఆలంబనగా వుంటుంది. అటువంటి ఆలంబన అయిన వారి శరీరంతో వారు చేసిన అవతారకార్య విశేషాలను, వారి నిజతత్వాన్ని స్మరించుకోవడానికి ఆరాధనా మహోత్సవాలు భక్తులకు ఉపకరిస్తాయి. అంతేకాదు, వారి ఆచరణకు ప్రతీకలు 'పాదుకలు' అని చెప్పారు పూజ్యశ్రీ మాస్టరుగారు. దత్త సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత పాదుకలకు వున్నది. ఈరోజు పూజ్యశ్రీ అమ్మగారి పాదుకలు రావటం, ఆరాధనా మహోత్సవం, మనందరం ఇక్కడ ఈ పరమపవిత్రమైన పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధానంలో ఈవిధంగా సత్సంగం చేసుకోగలగడము ...ఇది త్రివేణీసంగమం లాంటిది... ఎన్నో రెట్లు మనకు ఉన్నతమైన ఫలితమిచ్చే సన్నివేశం.

ఇంతటి మహాత్ములు మనకి దొరకడం మనం చేసుకున్న సుకృతమో, వారి అనుగ్రహమో చెప్పలేము. వారి అండ మనందరికీ వుండాలంటే ఒకటే పద్ధతి .. వారి బోధలను ఆచరించాలన్న తపన, తీవ్ర ప్రయత్నం...ఆ ప్రయత్నమే వాళ్ళకి ప్రీతి. కనుక వారి సన్నిధిని సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి. వారు ప్రసాదించిన ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, మనం వారికి ఇష్టమైన వారిగా తయారై, వారు ఇవ్వదలచిన ఉన్నతమైన అనుగ్రహాన్ని పొందే అర్హతకలిగిన వారిలా తయారవుదామని నిర్ణయించుకుని, అలా శాయశక్తులా ప్రయత్నిస్తామని వారికి చెప్పుకుందాము! అంటూ వేదమ్మగారు సత్సంగాన్ని ముగించి, కొంత సేపు భజన చేసి పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవానికి ముగింపు పలికారు. ●

# మాతృదేవి స్మృతులు

*శ్రీ దుర్గా ప్రసాద్*

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి లీలావైభవాన్ని హైదరాబాదు కొత్తపేట వాస్తవ్యులు శ్రీ దుర్గా ప్రసాద్ గారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

## గోరంత సేవకి కొండంత అనుగ్రహం!

జగన్మాత అలివేలు మంగమ్మ తల్లి కురిపించే వాత్సల్యాన్ని రుచి చూసే భాగ్యాన్ని నేను పొందగలగడం, వారి అపారకరణకు నిదర్శనంగా భావిస్తున్నాను. ఒకసారి నాగోలులో జరిగే కళ్యాణ మహోత్సవానికి మామిడాకులు సమయానికి రాలేదంటూ సులోచనగారు నాకు ఫోన్ చేశారు. నేను తప్పకుండా ప్రయత్నం చేస్తానని వారికి చెప్పాను. కళ్యాణ మహోత్సవంలో నాకు సేవ దొరికినందుకు చాలా ఆనందం కలిగింది. మా ఇంట్లో మామిడి చెట్టు వుంది. ఆ చెట్టు ఆకులు, అలాగే నా స్నేహితుడు ఇంట్లో మామిడి చెట్టు ఆకులు, కొన్ని అరటి పిలకలు.. ఇవన్నీ కారులో వేసుకొని నేనూ, మా అబ్బాయి నాగోలుకు వచ్చాము. తిరిగి వెళ్లబోతూ ఒకసారి నిలయంలో నమస్కారం చేసుకున్నాను. తిరిగి వచ్చేస్తుంటే సులోచనగారు కొద్దిసేపు ఆగమన్నారు. లోపలినుంచి పూజ్యశ్రీ అమ్మగారు నాకు ప్రసాదం పంపించి, మా అమ్మగారిని, నాన్నగారినీ అడిగినట్లు చెప్పమన్నారట! నాకు చాలా ఆనందం వేసింది. నిజానికి నేను చేసినది చాలా చిన్న సేవ. కానీ దానికి పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదం ఇవ్వడమే కాకుండా నా తల్లిదండ్రులకు కూడా ఆశీస్సులు ఇచ్చారు! నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. ఇక అప్పటినుంచీ ప్రతి సంవత్సరం జరిగే కళ్యాణోత్సవానికి నేను ఆ సేవను చేసుకుంటున్నాను.

## కవలపిల్లలు - నామకరణ

నాకు పెళ్లయిన తొమ్మిది సంవత్సరాల వరకూ సంతానం కలగలేదు. ఒకసారి నేను పూజ్యశ్రీ మాస్టరుగారికి, 'నాకు మగ పిల్లవాడు పుడితే సాయి భరద్వాజ అని నామకరణం చేసుకుంటాను' అని మొక్కుకున్నాను. నాకు కవలపిల్లలైన అబ్బాయిలు పుట్టారు. అప్పుడు నాకు ఒక సందేహం వచ్చింది – 'ఒక పిల్లవాడికి పూజ్యశ్రీ మాస్టరుగారి పేరు పెట్టుకుంటాను అని మొక్కుకున్నాను. మరి ఇంకొక పిల్లవాడికి ఏం పేరు పెట్టాలి?' అని! అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారితో ఈ విషయం విన్నవించుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు కాసేపు ధ్యానంలో వుండి 'దత్త భరద్వాజ' అని నామకరణం చేయమన్నారు. ఆ పేర్లకు చివర ఒకడికి హర్షిత్ అని ఇంకొకడికి వర్షిత్ అని కలుపుకున్నాము. ఎందుకంటే రోజువారీ వ్యవహారంలో వాళ్ళని ఎప్పుడైనా కోప్పడితే కష్టమని!!

నాకు ఆఫీసులో పని ఒత్తిడి వల్ల నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి చాలా తక్కువ సార్లు వెళ్లడం కుదిరేది. నేను ఆఫీసునుంచి వీలు చూసుకుని హడావిడిగా పరిగెత్తుకుని వచ్చేవాడిని. అలా వచ్చినా ఒక్కొక్కసారి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం వుండేది

కాదు. ఇదంతా తెలిసిన నా మిత్రులు, "మేము పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం వున్నప్పుడు ఫోన్ చేస్తాము. అప్పుడు తప్పకుండా రండి" అని చెప్పారు. నేను అలానే చేస్తుండేవాడిని.

## దర్శనంలో దివ్యానుభూతి

ఒకసారి, 'ఈరోజు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం వుంది' అని ఫోన్ వచ్చింది. ఆఫీసు విషయాలలో వున్న సమస్యలతో నా మనసు అప్పుడు చాలా చికాకుగా వుంది. కానీ ఒకవైపు పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకుందామని కూడా అంతే తపనగా వుంది. ఎలాగో గబగబా పని ముగించుకుని, 'ఇలాంటి మనస్తత్వంతో నేను వస్తున్నందుకు నన్ను క్షమించమని' పూజ్యశ్రీ అమ్మగారిని ప్రార్థించుకుంటూ నాగోలుకి



చేరుకున్నాను. నేను వెళ్లేసరికి పూజ్యశ్రీ అమ్మగారు దర్శనానికి వచ్చి వున్నారు. సత్సంగసభ్యులందరూ నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు. నేను నెమ్మదిగా శబ్దం అవ్వకుండా వెనుక వరుసలో కూర్చుంటూ పూజ్యశ్రీ అమ్మగారి వైపు చూశాను. పూజ్యశ్రీ అమ్మగారు నన్నే చూస్తున్నారు! ఒక్కసారిగా పూజ్యశ్రీ అమ్మగారి చూపుతో నా చూపు కలవగానే ఒక అనిర్వచనీయమైన అనుభూతి కలిగి నా మనసంతా నిరామయమై, అద్భుతమైన ప్రశాంతస్థితి అనుభవమైంది! అలాగే కళ్ళు మూసుకుని చాలాసేపు కూర్చున్నాను. దర్శనం అయిపోయిన వెంటనే అక్కడేవున్న నా స్నేహితుడు నాతో, "నువ్వు ఇక్కడికి వచ్చినప్పటినుంచి నువ్వు కూర్చునేదాకా అమ్మగారు నిన్ను చూస్తూనే వున్నారు!" అని చెప్పాడు. అప్పుడు కూడా నా మానసిక స్థితి అలాగేవుంది. ఆ తర్వాత పది పదిహేను రోజులు పూజ్యశ్రీ అమ్మగారిని స్మరించినప్పుడల్లా నా మనసు ఆ ఆనందమయ స్థితిలోకి వెళ్లిపోయేది! నేను కోరుకోకుండానే నాకు ఇంతటి ఆనందాన్ని, అనుభూతిని ప్రసాదించిన పూజ్యశ్రీ అమ్మగారికి సదా కృతజ్ఞుడనై వుంటాను.

## భావానికి బద్ధులు

నేను హైదరాబాదులో కొత్తపేటలో ఇల్లు కట్టుకున్నాను. మాది మొదటి అంతస్తు. ఈ విషయాన్ని దర్శనానికి వచ్చినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారికి తెలియజేసి, "మీరు తప్పకుండా మా ఇంటికి వచ్చి నన్ను అనుగ్రహించాలి" అని కోరుకున్నాను. నిజానికి పూజ్యశ్రీ అమ్మగారి పరిస్థితి తెలుసు. పైగా మాది మొదటి అంతస్తు కనుక పూజ్యశ్రీ అమ్మగారిని అక్కడికి తీసుకువెళ్లడం కష్టమని కూడా తెలుసు. కానీ లోపల ఆ భావాన్ని అణచుకోలేక ఆ రకంగా ప్రార్థించాను. పూజ్యశ్రీ అమ్మగారు చిన్నగా నవ్వారు.

తరువాత ఒకరోజు నాకొక స్వప్నం వచ్చింది. అందులో పూజ్యశ్రీ అమ్మగారు మా ఇంటికి వచ్చి ఇల్లంతా తిరిగి చూసి ఒక కుర్చీలో కూర్చున్నారు!!

కొంతసేపటికి ఇంకెవరో భక్తులు పూజ్యశ్రీ అమ్మగారిని వారింటికి తీసుకు వెళుతున్నారు. నేను శ్రీ ద్వారకబాబుగారిని మళ్ళీ రాత్రికి పూజ్యశ్రీ అమ్మగారిని మా ఇంటికే తీసుకురావలసినదిగా అర్థించాను. పూజ్యశ్రీ అమ్మగారికి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు సమకూరుస్తానని చెప్పాను. స్వప్నం పూర్తయింది. నాకు ఎంతో ఆనందం కలిగింది. వారు సర్వసమర్థులు కనుక బాహ్యంగానే రానవసరం లేదు, ఈ విధంగా కూడా వచ్చి మనల్ని అనుగ్రహించవచ్చునని అర్థమై చాలా సంతోషం వేసింది. ఆ విధంగా పూజ్యశ్రీ అమ్మగారు నా కోరిక తీర్చారు.

## స్వప్నంలో అభయ ప్రదానం

2021వ సంవత్సరంలో పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందడానికి నాలుగు నెలల ముందు ఒకరోజు తెల్లవారుజామున ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నా ఉద్యోగ విధులలో జరిగిన ఒక విషయంలో నా తప్పేమీ లేకపోయినా అందరూ నన్ను విమర్శిస్తుంటే నేను చాలా బాధపడుతున్నాను. అకస్మాత్తుగా అక్కడ శ్రీ ద్వారకబాబుగారు కనిపించి, “ఈ విషయంలో మీ తప్పేమీ లేదు, బాధపడవద్దు” అని చెప్పారు. కానీ నా బాధ తీరలేదు. తర్వాత పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి, “నీకు ఏ సమస్యా రాదు. ఏమీ బాధపడవద్దు!” అని చాలాసేపు ఓదార్చారు. నేను నిద్ర లేస్తూనే, ‘ఈరోజు ఏదో జరగబోతోంది. అందుకే పూజ్యశ్రీ అమ్మగారు నాకు స్వప్నదర్శనమిచ్చి ధైర్యం చెప్తున్నారు’ అనుకున్నాను.

## ఆఫీసు సమస్యల నుండి రక్షణ

చిత్రంగా అదేరోజు మధ్యాహ్నం మా ఆఫీసులో ఒక గొడవ జరిగింది. మేము మెటీరియల్ అందించే ఒక కంపెనీ మేనేజర్ నాకు ఫోన్ చేశాడు. అతనికి నేనంటే అసలు పడదు. ఒక విషయమై నన్ను ఆరా తీస్తూ మేము పంపించిన డాక్యుమెంట్స్ లో జరిగిన ఒక తప్పుని నాకు తెలియజేశాడు. అది కూడా చాలా తీవ్రమైన విధంగా తెలియజేశాడు. నేను తిరిగి దాన్ని పరీక్ష చేస్తే మా టైపిస్టు పంపిన డేటాలో ఒక తప్పిదం జరిగింది. అది ఆ మేనేజర్ కి దొరికింది. నేను ఈ విషయంలో ఎంత సర్ది చెప్పినా అతను సమాధానపడటం లేదు. అతను ఇంకా లోతుగా దాన్ని పరిశీలిస్తే ఈ తప్పిదం వల్ల మా కంపెనీకి అక్కడనుంచి ఆర్డర్లు రావడము ఆగిపోయే సమస్య వస్తుంది. ఈ జరిగే నష్టాన్ని తలుచుకుని నేను తీవ్రమైన ఆందోళనకు గురయ్యాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారికి సన్నిహితంగా వుండే ఒక గురుబంధువుకు ఫోన్ చేసి ఈ విషయమంతా పూజ్యశ్రీ అమ్మగారికి తెలియజేయవలసిందిగా ప్రార్థించాను. వారు పూజ్యశ్రీ అమ్మగారికి నా విషయం విన్నవించారు. దాదాపు రెండు వారాలు ఈ సమస్య విషయమై ఎంతో ఆందోళన చెందాను. తర్వాత ఆ మేనేజర్ దాన్ని లోతుగా పరిశీలించకుండా నేను ఇచ్చిన వివరణలతో సంతృప్తి పడటంవల్ల తిరిగి మా ఉద్యోగ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇది కేవలం పూజ్యశ్రీ అమ్మగారి ఆశీర్వాదం, అనుగ్రహం తప్ప ఇంకొకటి కాదు! లేకుంటే అతనికి నేనంటే వున్న వైరానికి ఈ సమస్య సులభంగా పరిష్కారం అయ్యేదే కాదు! సమస్య వచ్చేముందే పూజ్యశ్రీ అమ్మగారు నన్ను స్వప్నంలో ఓదార్చడం, అదేవిధంగా భౌతికంగా ఆశీర్వదించడంతో నేను ఈ సమస్య నుంచి బయటపడగలిగాను.

ఇలాంటి ఎన్నో ఆపదల నుంచి కాపాడి ఇంకెన్నో అనిర్వచనీయమైన అనుభూతులను ప్రసాదించిన పూజ్యశ్రీ అమ్మగారు భౌతికంగా దూరమైనా, ఈనాటికీ నిత్యసత్యులై మనందరి హృదయాలలో కొలువైవున్నారు. జన్మజన్మలకూ ఆ గురుదంపతుల వాత్సల్యానురాగాలు పొందే భాగ్యాన్ని కలిగించమని మనస్పూర్తిగా వేడుకుంటున్నాను. ●

*(గత సంచిక తరువాయి)*

# శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం)

*శ్రీమతి టి. పద్మావతి*

**(ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన పవిత్రమైన భీమ-అమరజా నదుల సంగమతీరంలో సాక్షాత్తు దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతిస్వామివారు సుదీర్ఘకాలం నివసించి నేటికీ నిర్గుణ పాదుకల రూపంలో విరాజమానులైవున్న శ్రీ క్షేత్ర గాణ్గాపుర యాత్రలో గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు, శ్రీశ్రీకాంత్‌గార్లు వారి కుమారులు చిరంజీవి తీర్థ చరణ్ మరియు కుమార్తె చిరంజీవి కైవల్య లతో సకుటుంబంగా పాల్గొని గత సంవత్సరం నవంబరు 26వ తేదీ నుండి డిసెంబరు 2వ తేదీ వరకు శ్రీ గురుచరిత్ర సప్తాహ ప్రవచనం చేశారు. మన సాయిబాబా పత్రిక పాఠకుల కోసం హృద్యంగా అందించబడిన యీ అద్భుతమైన యాత్రా విశేషాలను ఫిబ్రవరి సంచిక నుండి మీ ముందుంచుతున్నాం! - ఎడిటర్.)**

## సప్తాహ ప్రవచనము

నవంబర్ 26వ తేదీ సాయంత్రం సరిగ్గా 4 గంటలకు, గాణ్గాపుర మఠం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుండగా శ్రీ గురుచరిత్ర ప్రవచన మహోత్సవం ప్రారంభమైంది. ముందుగా శ్రీమతి వేదమ్మగారు శ్రీగురుని దివ్య దర్శనం చేసుకుని, మఠం లోపల మనకు కేటాయించిన పవిత్ర ప్రదేశంలో ప్రవచనానికి ఉపక్రమించారు. క్షేత్రంలో కన్నడ భాష మాట్లాడే భక్తులు అధికంగా వుండటంతో, అందరికీ ప్రవచనం అర్థం కావాలనే సదుద్దేశంతో మొదటిరోజు ఒక వినూత్న ప్రయత్నం చేశారు. బెంగళూరుకు చెందిన మన గురుబంధువు శ్రీ శివకుమార్ గారు వేదమ్మగారి ప్రవచనాన్ని వాక్యానువాదం (translation) చేశారు. అయితే, మొదటిరోజు ముగిసేసరికి ఈ ప్రక్రియ వల్ల ప్రవచన ధారకు, భావ వ్యక్తీకరణకు కొంత



అంతరాయం కలుగుతోందని గమనించారు. పైగా, ఆగి ఆగి చెప్పడం వల్ల నిర్ణీత సమయంలో గ్రంథాన్ని పూర్తి చేయడం కష్టమనిపించి, ఆ ప్రక్రియను ఆ రోజుతోనే ముగించారు.

అనంతరం వేదమ్మగారు భక్తులను ఉద్దేశించి ప్రవచన శైలి గురించి ఒక ముఖ్యమైన స్పష్టతనిచ్చారు. "శ్రీ గురుచరిత్రను మనమందరం నిత్యం పారాయణ చేసుకుంటాము. కాబట్టి ఇక్కడ నేను కేవలం కథలను, లీలలను మాత్రమే వివరించడం కాకుండా, వాటి వెనుక ఉన్న పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన ఉపోద్ఘాతాన్ని, ప్రస్తావనలను వివరిస్తూ సత్సంగం నిర్వహిస్తాను" అని తెలియజేశారు. దీనివల్ల వారం రోజుల్లోనే అన్ని అధ్యాయాలు పూర్తి చేయాలనే నియమం కంటే, ఆ దివ్య బోధనల సారాంశాన్ని అర్థం చేసుకోవడమే ముఖ్యమని, అప్పుడే మనకు అవగాహన పెరిగి ఆచరణ స్పష్టమవుతుందని వివరించారు.

అయితే, సత్సంగంలో పాల్గొన్న వారిలో అసలు శ్రీ గురుచరిత్ర పరిచయం లేనివారు కూడా వున్నారని తెలుసుకున్న వేదమ్మగారు, వారి సందేహాలను తీరుస్తూ దత్తావతార మహాత్మ్యంలోని మొదటి రెండు అవతారాల గురించి, వారి దివ్య లీలల గురించి క్లుప్తంగా ప్రస్తావించారు. ఆ తర్వాతే సత్సంగ ప్రవచనంలోకి లోతుగా ప్రవేశించారు.

ప్రతిరోజూ ప్రవచనాల మధ్యలో భక్తుల కోసం కొంత విరామ సమయాన్ని కేటాయించారు. ఆ సమయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో వేదమ్మగారు ఎంతో ఆత్మీయంగా సంభాషించేవారు. భక్తుల సందేహాలను నివృత్తి చేస్తూ, వారి ఆధ్యాత్మిక అనుభవాలను పంచుకుంటూ సాగిన ఆ సమయం అందరికీ ఒక గొప్ప ఊరటను ఇచ్చింది. ఆ విరామం తర్వాత తిరిగి ప్రవచనం కొనసాగేది. ఈ విధంగా, ఒకవైపు జ్ఞాన బోధన, మరోవైపు భక్తుల మధ్య ఆత్మీయ అనుబంధంతో ఆ సాయంత్రాలు అత్యంత పవిత్రంగా సాగాయి.

శ్రీమతి వేదమ్మగారు యాత్ర ప్రారంభంలోనే ప్రధాన క్షేత్రాలన్నింటినీ దర్శించి, నవంబర్ 26వ తేదీ నుండి పూర్తిగా శ్రీ గురు చరిత్ర ప్రవచనాలకు అంకితమయ్యారు. భక్తుల సౌకర్యార్థం ప్రవచనాలు ప్రతిరోజూ సాయంత్రం జరిగేవి.

దీనివల్ల భక్తులకు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకునే అద్భుత అవకాశం లభించింది. ఈ విధంగా భక్తులు ఒకవైపు ఉదయం క్షేత్ర దర్శనంతోను, సాయంత్రం ప్రవచన సుధతో శరీరాన్ని, మనసును పవిత్రం చేసుకుంటూ తమ గాణ్గాపుర యాత్రను విజయవంతంగా సాగించారు.

నవంబర్ 27, ఉదయమే భక్తులందరూ అత్యంత భక్తిభావంతో శ్రీగురుని మఠానికి చేరుకున్నారు. అక్కడ జగద్గురు శ్రీ దత్తాత్రేయ స్వామి, సమర్థ సద్గురు సాయినాథులు, మరియు పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవుల దివ్య చిత్రపటాలను చేతబూని సామూహిక సంగమయాత్రకు శ్రీకారం చుట్టారు.

ఆ దివ్యమూర్తుల చిత్రపటాలను ఊరేగిస్తూ, భక్తులందరూ పాదచారులై భజనలు, నామస్మరణలతో గాణ్గాపుర వీధులను ఆధ్యాత్మిక చైతన్యంతో నింపివేశారు. దత్త నామస్మరణ దిక్కులు పిక్కటిల్లుతుండగా, సాగుతున్న ఆ పాదయాత్ర సాక్షాత్తు ఒక పవిత్ర యజ్ఞంలా తోచింది. భక్తులందరూ ఏకమనస్కులై, గురుదేవుల కృపాకటాక్షాలను స్మరిస్తూ సంగమ తీరం వైపు అడుగులు వేశారు.

మార్గమధ్యంలో పవిత్రమైన విశ్రాంతి కట్టకు చేరుకోవడానికి ముందే, కొందరు భక్తులు ఉత్సాహంగా ముందుగానే వెళ్లి, ఆ మార్గమంతటినీ భక్తితో శుభ్రపరచారు. విశ్రాంతి కట్టకు అటు ఇటు సుమారు రెండు కిలోమీటర్ల మేర దారి పొడవునా రంగురంగుల రంగవల్లులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతిరోజూ ఉదయం పది గంటల సమయానికి సాక్షాత్తు ఆ శ్రీగురుడు విశ్రమించడానికి వచ్చే ఆ పరమ

పవిత్ర ప్రదేశానికి... జగద్గురువులైన దత్తస్వామిని, సాయినాథుని, మరియు గురుదంపతులైన పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవులను సాదరంగా ఆహ్వానించాలన్నది ఆ భక్తుల ఆకాంక్ష. ఆ రంగవల్లుల మధ్యన గురుదేవుల చిత్రపటాలను ఊరేగిస్తూ భక్తులు అడుగులు వేస్తుంటే, ఆ ప్రదేశమంతా ఆధ్యాత్మిక చైతన్యంతో వెలిగిపోయింది.

ఉదయం 10 గంటల సమయానికి, పాదయాత్రగా బయలుదేరిన భక్తులందరూ పవిత్రమైన విశ్రాంతి కట్టకు చేరుకున్నారు. సరిగ్గా స్వామి విశ్రమించే ప్రదేశంలోనే దత్తస్వామి, సాయినాథుడు మరియు గురుదంపతుల దివ్య చిత్రపటాలను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ట్రస్ట్ వారు భక్తులకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భిక్షాన్నాన్ని ముందుగా శ్రీగురునికి, దత్తస్వామికి, బాబాకు మరియు గురుదంపతులకు నివేదించారు. సరిగ్గా శ్రీ గురుడు ప్రతిరోజూ ఉదయం పది గంటల సమయానికి విశ్రమించడానికి వచ్చే ఆ పరమ పవిత్ర ప్రదేశంలో, భక్తులందరూ అత్యంత భక్తితో భిక్ష సమర్పించారు. ఆపై ఆ పవిత్ర ప్రసాదాన్ని భక్తులందరూ స్వీకరించి, పరమ తృప్తిని పొందారు. ఆ పవిత్ర ప్రదేశంలో గురునామ స్మరణల మధ్య జరిగిన ఆ కార్యక్రమం భక్తుల మనసులలో మరువలేని ఆధ్యాత్మిక ముద్ర వేసింది.

ఇంతలో ఒక అపురూపమైన ఆధ్యాత్మిక ఘట్టం ఆవిష్కృతమైంది. శ్రీగురుని పరమ భక్తుడైన పర్వతేశుని వంశానికి చెందిన ఏడవ తరం వారసుడు, శ్రీగురుచరిత్రలో ప్రస్తావించబడిన పర్వతేశుని వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. శ్రీగురుని కృప ఆ భక్త శిఖామణిపై ఎలా ప్రసరించిందో ఆయన హిందీ భాషలో ఎంతో హృద్యంగా వినిపించారు. ఆ వంశీయుల నోటి నుండే ఆ చారిత్రక గాథను విన్న భక్తులు పులకించిపోయారు.

అక్కడినుండి భక్తులందరూ పాదచారులై పవిత్ర సంగమ క్షేత్రానికి చేరుకున్నారు. భీమా–అమరజా నదుల కలయికతో పరమ పవిత్రమైన ఆ సంగమ తీర విశేషాలను మరియు అక్కడి అష్ట తీర్థాల ప్రాశస్త్యాన్ని భక్తులు మననం చేసుకున్నారు. అనంతరం, ఆ దివ్య జలాలలో భక్తులందరూ సంగమ స్నానమాచరించి పునీతులయ్యారు.

తరువాత భక్తులందరూ షట్కూల తీర్థం (చక్ర తీర్థం) లో కూడా స్నానమాచరించి, మేడి చెట్టుకు ప్రదక్షిణలు చేసుకుని, అక్కడ కొలువై వున్న శ్రీ సంగమేశ్వర స్వామిని అత్యంత భక్తితో దర్శించుకున్నారు. ఆ పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొంది, మనసునిండా ఆధ్యాత్మిక తృప్తితో, ఉత్సాహంతో నామస్మరణలు చేస్తూ చిత్రపటాలను ఊరేగిస్తూ పాదయాత్రగా తిరిగి మఠానికి చేరుకున్నారు. ఈ సంగమ యాత్ర భక్తులందరి హృదయాలలో ఒక అద్భుతమైన అనుభూతిని నింపింది.

నవంబర్ 28వ తేదీ ఉదయమే, భక్తులందరూ మరల శ్రీగురుని మఠం నుండి తమ పవిత్ర యాత్రను ప్రారంభించారు. భగీరథ తీర్థం చేరుకుని, అక్కడి నుండి పాపనాశ తీర్థం, కోటి తీర్థం, రుద్రపాద తీర్థం మరియు చక్ర తీర్థం వరకు ప్రతి పుణ్య తీర్థాన్ని దర్శించారు. ఆయా తీర్థాల వద్ద శ్రీగురుడు స్వయంగా వివరించిన మహిమలను, శ్రీగురుచరిత్రలోని విశేషాలను భక్తితో మననం చేసుకుంటూ స్నానమాచరించారు. అలా ఆ ఐదు తీర్థాల పవిత్ర స్నాన ఫలంతో భక్తులందరూ పునీతులయ్యారు.

29వ తేదీ ఉదయం శ్రీగురుని మఠం నుండి కల్లేశ్వర యాత్ర సాగింది. ఆనాడు మఠం నుండి ఆలయం వరకు దారి పొడవునా భక్తులు అత్యంత ఉత్సాహంతో రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. మనోరథ తీర్థంలో స్నానమాచరించిన తరువాత, కల్లేశ్వరుని సన్నిధిలో భక్తులందరూ కలిసి హృద్యంగా భజనలు, నామస్మరణ చేశారు. మన్మథ తీర్థం గురించి, కల్లేశ్వరుని ప్రాశస్త్యం గురించి శ్రీగురుడు బోధించిన అధ్యాయాలను పారాయణ చేసుకుని, ఆ మహదేవుని కృపను పొంది తిరిగి ప్రయాణమయ్యారు.

30వ తేదీన భక్తులందరూ కలిసి కుమసి గ్రామానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ కృష్ణా నది తీరాన పరమ భక్తుడైన త్రివిక్రమభారతి అనుష్ఠానం చేసుకున్న పవిత్ర ప్రదేశాన్ని దర్శించి, ఆ నదీమాతకు భక్తితో ప్రణామాలర్పించారు. శ్రీగురుడు త్రివిక్రమ భారతికి తన 'విశ్వరూపాన్ని' ప్రదర్శించిన ఆ దివ్య ప్రదేశంలో కొలువై వున్న ఆలయంలో శ్రీగురుని విశ్వరూప పాదుకలను, చిన్న శివలింగాన్ని దర్శించుకున్నారు. అక్కడ అందరూ సామూహికంగా కూర్చుని, త్రివిక్రమభారతికి విశ్వరూప దర్శనం లభించిన ఆ శ్రీగురు చరిత్ర అధ్యాయాన్ని ఏకకంఠంతో పారాయణ చేశారు.

త్రివిక్రమభారతి జీవసమాధిని దర్శించుకుని తిరిగి వస్తుండగా, వారి వంశస్థులు భక్తులందరికీ 'టీ' ప్రసాదం ఇచ్చారు. అందరూ సంతోషంగా స్వీకరించి మఠానికి చేరుకున్నారు.

ద్వాపర యుగంలో అర్జునుడికి లభించిన విశ్వరూప దర్శనం, మళ్ళీ నరసింహ సరస్వతి స్వరూపంలో త్రివిక్రమ భారతికి లభించిన వైనం ఈ అధ్యాయం ద్వారా మనకు స్మరణకు వచ్చింది.

సమర్థ సద్గురు సాయినాథుడు అన్ని జీవులలోనూ, అందరు మహాత్ములలోనూ, సాధువులలోనూ మరియు సకల దేవతల రూపంలోనూ నిరంతరం తన విశ్వరూపాన్ని చూపిస్తూనే వుంటారని 'శ్రీ సాయి లీలామృతం'లోని ప్రతి లీలలో మనకు అర్థమవుతుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా తామే సకల హృదయాలలో నిండి ఉన్నామని అనేకమంది భక్తులకు ప్రత్యక్షంగా అనుభూతిని కలిగించారు. భక్తుల కష్టనష్టాలలో వెన్నంటే ఉండి నడిపించే అపర దత్త స్వరూపులు వారు. అంతటి మహనీయుల హృదయం నుండి జాలువారిన శ్రీగురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం వంటి గ్రంథాలు ఎంత పవిత్రమైనవో మనసా స్మరించుకున్నాము. ఈ దివ్య గ్రంథాలను పారాయణం చేస్తూ, దత్తస్వామి అపార అనుగ్రహం పొందేలా మనల్ని కరుణించిన పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి అనంతకోటి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఆ రోజు మా యాత్రను ధన్యతతో ముగించాము.

గాణ్గాపుర పుణ్యక్షేత్రంలో గడిపిన ఆ ఏడు రోజులు ప్రతి భక్తుడి జీవితంలో ఒక మరువలేని ఆధ్యాత్మిక శిక్షణలా సాగాయి. క్షేత్రంలో ఉన్నంత కాలం ప్రతి ఒక్కరూ తమ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. సత్సంగ సభ్యులంతా శ్రీగురుని దివ్య నామస్మరణ చేస్తూ గాణ్గాపుర వీధుల్లో పెద్ద పెద్ద రంగురంగుల ముగ్గులు వేసి తమ సేవా నిరతిని చాటుకున్నారు. పవిత్ర సంగమంలో కూడా అక్కడ పారాయణ చేసుకునే సాధువులందరికీ భక్తులు భిక్ష సమర్పించుకున్నారు.

ఉదయమంతా ఇటువంటి క్షేత్ర దర్శనాలు, సేవా కార్యక్రమాలతో గడిపిన భక్తులు, సాయంత్రం 4 గంటలకల్లా మఠానికి చేరుకుని శ్రీమతి వేదమ్మగారి అమృతవాణి ద్వారా 'శ్రీ గురు చరిత్ర' సత్సంగ ప్రవచనాల్లో పాల్గొనేవారు. కేవలం కథలు వినడమే కాకుండా, ప్రతి లీల వెనుక ఉన్న నిగూఢ అంతరార్థాలను గ్రహిస్తూ ఆధ్యాత్మిక స్పష్టతను సాధించేవారు. ప్రవచనాల అనంతరం రాత్రివేళ మందిరంలో అత్యంత వైభవంగా జరిగే పల్లకి సేవను కనులారా వీక్షించి, నిశీధి వేళ మనసును ప్రశాంతతతో నింపే శేజ్ హారతిలో పాల్గొని తమ రోజును ధన్యంగా ముగించేవారు. నిర్వహణా కమిటీ వారు ఏర్పాటు చేసిన అద్భుతమైన వసతి, భోజన సదుపాయాల వల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగలేదు. ఈ విధంగా సేవ, స్మరణతో భక్తులందరూ తమ గాణ్గాపుర యాత్రను ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక సాధనగా మలుచుకున్నారు.

డిసెంబరు ఒకటవ తేదీన పవిత్రమైన ఏకాదశి. ఆరోజు స్వామి ఉపవాసం ఉంటారు కనుక గాణ్గాపురంలో మధుకరి వుండదు. భక్తులందరూ నిరంతరం భగవత్ చింతనతో, పారాయణతో రోజంతా గడిపారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 7

**5. శ్రీ చివటం అమ్మ :** చివటం అమ్మగారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు అచ్చమ్మ. వీరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపాన గల చివటం గ్రామానికి 8 మైళ్ళ దూరాన గల రేలంగి గ్రామం. అమ్మకు చిన్న వయస్సులోనే వివాహమైంది. ఈమె భర్త అంజయ్యగారు చివటం గ్రామంలో పండ్లు – కూరగాయల వ్యాపారం చేసేవారు. వచ్చిన డబ్బుతో తప్పతాగి యింటికి వచ్చి అమ్మను కొడుతుండేవారు. అమ్మ ఓర్పుతో సహించేవారు. 20 సం॥ల వయస్సులో అమ్మకు ఒక కుమారుడు జన్మించాడు.

అమ్మ చిన్నతనం నుంచీ రామనామం చేసేవారు. అరటి గెలలు కాపువేసే గూట్లో కూర్చుని ధ్యానస్థులయ్యేవారు. కాలాంతరంలో సాధూరాం బాబాజీ అనే మహనీయుడు అమ్మపై తమ కండువా విసిరి "ముండనం చేయించుకుని ముండ లాగా వుండు" అని ఆదేశించటంతో ఆమె దిగంబరిగా వుండిపోయారు. ఆ తర్వాత అమ్మ బాహ్యస్మృతి లేక ఎక్కడ పడితే అక్కడ కూర్చొని ధ్యానస్థ లవుతుండేవారు. కొంతకాలానికి కొందరు భక్తులు అమ్మకు రామాలయం వెనుక కుటీరం నిర్మించారు. అమ్మ ఆ కుటీరంలో వుండేవారు.

భరద్వాజ మాస్టరుగారు 1973 సెప్టెంబరులో ఏలూరుకు స్పాట్ వాల్యుయేషన్ కు వెళ్ళారు. అక్కడ చివటం అమ్మ గురించి మొట్టమొదటిసారిగా విని ఒక ఆదివారం నాడు అమ్మ దర్శనానికై బయలుదేరారు. ఇద్దరు ముగ్గురు మిత్రులు కూడా అమ్మను దర్శించాలని ఉత్సాహం చూపడంతో వారిని కూడా వెంట బెట్టుకుని తణుకు చేరి అక్కడ నుండీ కాలినడకన చివటం బయలుదేరారు. చివటం ఊరి పొలిమేరలు చేరేసరికి అమ్మ రోడ్డు మీద ఎదురుగా వస్తూ వీరికి కన్పించారు. దిగంబరి అయిన ఆమెను అమ్మగా గుర్తించిన భరద్వాజగారు ఆమెకు నమస్కరించుకొనటానికి ఆమెను సమీపిస్తుండగా, అమ్మయే స్వయంగా ఆ రోడ్డుమీద భరద్వాజగారి పాదముల ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. అమ్మ లేవగానే మాస్టరుగారు అమ్మ చేతికి పువ్వులు, పండ్లు సమర్పించుకొని ఆమెకు సాష్టాంగ నమస్కారం చేసుకున్నారు.

ఈ సన్నివేశాన్ని గురించి నిరహంకారి, అత్యంత నిరాడంబర హృదయులు అయిన శ్రీ భరద్వాజ గారు, "అందరిలోనూ ఆ పరమాత్మను దర్శించే అవధూతలు ఎందుకలా చేస్తారో చెప్పడం కష్టం. ఇందులో మన గొప్పతనం ఉందనుకోవటం అవివేకం" అన్నారు.

- సశేషం

# ద్వారకామాయి అనుభవమండపము

**_జేమ్స్ ఉడ్, కెనడా_**

నా పేరు జేమ్స్ ఉడ్. నేను కెనడాకు చెందిన సాయిబాబా భక్తుడను. నేను ఆయన భక్తుడనెలా అయిందీ వ్రాస్తున్నాను. 1978లో నాకు చాలా ప్రమాదమయిన జబ్బు చేసింది. మూత్రపిండములు పనిచేయడం మానివేసాయి. సుమారు 6 మాసములు మృత్యుముఖంలో వున్నాను. వాటివలె పనిచేసే యంత్రాన్ని నా శరీరమునకు తగిలించి నా ప్రాణాన్ని కాపాడాలని డాక్టర్లు యత్నించారు. కాని నా శరీరం ఆ యంత్రాన్ని అంగీకరించలేదు. ఇంకెవరయినా దానం చేసిన ఆరోగ్యవంతమయిన మూత్రపిండములను నా మూత్రపిండాలకు బదులు నా శరీరమునకు అమర్చినా ఉపయోగముండబోదని వైద్యులు ఊహించారు. కానీ అంతకంటే వేరొక కర్తవ్యం కన్పించక నన్ను జూన్ 19వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. నన్ను తన స్వంత తోబుట్టువుకంటే, యెక్కువగా చూచుకుంటున్న సోదరి లెస్లీబానీ నా బాగోగులు విచారిస్తున్నది. ఆ ఆరు మాసములలో ఎన్నోసార్లు నేను మృత్యువును చవిచూసి, కేవలం విధివశాన మాత్రమే తిరిగి జీవించిన సందర్భములన్నీ ఆమెకు తెలుసు. ఒక రోజు ఆమెతో కలిసి నన్ను చూడడానికి ఒక శిరిడీ సాయి భక్తుడు గూడ వచ్చాడు. ఆయన నన్ను చూస్తూనే, “మీరేమీ భయపడకండి. శిరిడీ సాయిబాబా భగవంతుడు. ఆయనను మనసారా ప్రార్థించుకొని ఈ విభూతి సేవించండి. మీకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే. మూత్రపిండములను బాగుచేయగల సామర్థ్యం ఆయనకు, ఆయన విభూతికి యున్నది” అని చెప్పి వెళ్ళాడు. నేను జన్మతః క్రైస్తవ మతానికి చెందిన వాడినని కాబోలు బైబిల్ లో యేసు ప్రభువు తన శిష్యులకు నేర్పించిన ‘పరలోక ప్రార్థన’ (The Lord’s prayer)ను సాయిబాబా పరంగా మలచి వ్రాసిన చీటీని ఆ భక్తుడు నాకిచ్చి వెళ్ళాడు. మరుసటి రోజు కూడా అతడి వద్ద నుండి విభూతిని, శిరిడీ నుండి అతడు తెచ్చుకున్న తీర్థాన్ని లెస్లీబానీ ద్వారా ఆయన నాకు పంపాడు. నేనవి సేవించిన కొద్దిసేపటికి వైద్యులు వచ్చి నా మూత్ర పిండములను ప్రతి అరగంటకూ పరీక్ష చేశారు. మూడవనాటి రాత్రికల్లా నా వ్యాధి రూపుమాసిపోయింది నా మూత్రపిండములు ఎట్టి చికిత్సా లేకుండానే చక్కగా పనిచేయనారంభించాయి. వైద్యుల ఆశ్చర్యానికి అంతేలేదు!! వారందరూ నా పడక చుట్టూ గుమిగూడి ఒకరితో నొకరు, “మూత్రపిండములు యింత పూర్తిగా దెబ్బతిని పోయినతర్వాత అవి మరలా తిరిగి బాగై, రోగి జీవించిన సందర్భం ఈ ఆస్పత్రి చరిత్రలో ఇది యొక్కటే! మాకు తెలిసినంత వరకూ అటువంటి ఉదంతం మరే ఆస్పత్రి చరిత్రలోనూ లేదు” అని ఎంతో ఆశ్చర్యంగా చెప్పుకున్నారు.

నాకు వ్యాధి పూర్తిగా తగ్గిన తర్వాత ఒక రాత్రి సాయి స్వప్నంలో కనిపించి, “భగవంతుని అనుగ్రహం నిన్ను యిలా రక్షించడం యిదే చివరిసారి” అన్నారు. అంతటితో నాకు మృత్యువు తప్పదన్న భయం విపరీతమయి నన్నెలాగయినా రక్షించమని, తెలిసో తెలియకో నేను చేసిన పాపాలన్నింటినీ క్షమించి, వాటినుండి నా ఆత్మను పరిశుద్ధం చేసి, నన్ను శాశ్వత నరకం నుండి రక్షించమని సాయిని ప్రార్థించాను. మరుక్షణమే రాతి మీద కూర్చున్న సాయి ప్రక్కనే ఆ సాయి భక్తుడు కన్పించి, ‘ఇకనుండి నీవు ఆయన్నే ఆశ్రయించాలి’ అన్నాడు.

జూన్ 22న తెల్లవారుతూనే నన్ను పరీక్ష చేసిన వైద్యులు పైన తెల్పిన రీతిన నా వ్యాధి తగ్గడం గూర్చి దిగ్భ్రాంతి చెందారు. ఆ మ్రొక్కు చెల్లించడానికే నేను ఫిబ్రవరి 22, 1979న శిరిడీ దర్శించాను.

**(‘సాయిలీల’ సాజన్యంతో...)**

# ఆచార్యుని అద్భుత లీలలు

*శ్రీ టి. కె. పురుషోత్తం, కన్నాపురం*

కన్నాపురం వాస్తవ్యులు శ్రీ టి. కె. పురుషోత్తంగారు పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులతో వారి అనుభవాలను, అనుభూతులను ఈ విధంగా పంచుకుంటున్నారు.

## గురు దర్శనానికి అంకురార్పణ

అది 1982 సంవత్సరం. నేను మా బావగారైన మారెళ్ళ సూర్యనారాయణమూర్తి (A.O Electricity Dept.)గారి ఇంట్లో తణుకులో ఉన్నాను. ఆయన నన్ను పూజ్య భరద్వాజ మాస్టరుగారు రాసిన 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం పారాయణ చేయమని చెప్పారు. నేను అయిష్టంగానే ఆ గ్రంథ పారాయణ మొదలు పెట్టాను. అంతలో తణుకులో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాదులో ఆఫీసర్ గారింటికి భరద్వాజ గురుదేవులు వచ్చారని, మనం వెళ్లి దర్శించుకుందామని మా బావగారు చెప్పారు. తెల్లవారి ఉదయం 6 గంటల ప్రాంతంలో తణుకు ఆఫీసరుగారి ఇంటికి వెళ్ళాము.

## అంతర్యామిగా గురువు: మనసులోని కోరికలు

వెళ్లే ముందు నేను మనసులో గురువుగారిని రెండు కోరికలు కోరాను. మొదటిది నేను గురువుగారి పాదాలకు నమస్కరించుకోవాలి. నాకు అక్కడ ఆ అవకాశం రావాలి. రెండవది నేను అడగకుండానే గురువుగారు నాకు ప్రసాదం యివ్వాలి. ఇలా మనసులో యీ రెండు కోరికలు చెప్పుకొని మా బావగారితో కలిసి నేను అక్కడికి వెళ్ళాను.

మేము వెళ్ళగానే గురువుగారు నా మనసులోని కోరిక గ్రహించారా అన్నట్లుగా నేను నమస్కరించుకుంటానికి వీలుగా వారి పాదాలు క్రింద పెట్టారు. నేను ఎంతో సంతోషంతో అదే మంచి సమయమని ఆలస్యం చేయకుండా వారి పవిత్ర పాదాలకు నమస్కరించుకున్నాను. ఈ విధంగా నా మొదటి కోరిక నెరవేరింది.

## గురువు ఇచ్చిన దిశానిర్దేశం

తరువాత మేము గురువుగారి ఎదుట కూర్చున్నాము. అప్పుడు ఆయన సాయి లీలలు మాకు చెప్పారు. నాతో 10 నుంచి 20 సార్లు "నీకు సాయి అనుగ్రహం చాలా వుంది. ఎన్ని కష్టాలు వచ్చినా సాయిని విడవవద్దు" అని చెప్పారు. "కష్టాల్లో, సుఖాల్లో సాయిని మరువవద్దు, విడవవద్దు" అని పదే పదే చెప్పారు. తర్వాత సమయం ఉదయం 7:00 గంటలు అవుచున్నది. అప్పుడు ఆఫీసర్ గారు శ్రీ మాస్టరుగారిని పలహారం చేయటానికి రమ్మన్నారు. వారితోపాటు మమ్మల్ని కూడా రమ్మన్నారు. అప్పుడు మేము కూడా వెళ్ళాము. గురువుగారితో ప్రక్కన కూర్చుని ఫలహారం చేసే అదృష్టం నాకు కలిగింది. అది నా జన్మజన్మల పుణ్యఫలంగా నేను భావించుచున్నాను. తర్వాత మేము గురువుగారి వద్ద కూర్చున్నాము. మరల ఆయన సాయి లీలలు చెప్పారు. నాతో "నీకు సాయి అనుగ్రహం చాలా ఉంది. కావున నీవు సాయిని విడవద్దు" అని పదేపదే చెప్పారు.

## నెరవేరిన రెండవ కోరిక

అంతా అయిన తర్వాత మేము ఇంటికి బయలుదేరే ముందు గురువుగారు వద్ద సెలవు తీసుకున్నాము. అప్పుడు వెంటనే గురువుగారు "నీవు ప్రసాదం అడిగావు

కదా తీసుకో" అని నాకు పండు ప్రసాదంగా యిచ్చారు. ఇలా నా రెండవ కోరిక కూడా తీరడంతో మనస్సు ఎంతో సంతోషంతో పులకించింది. ఈ రెండు లీలలు నన్ను సాయికి మరింత చేరువ చేశాయి.

### గురు అనుగ్రహంతో శిరిడీ యాత్రలు

1988 సంవత్సరం విజయదశమికి తొలిసారిగా నేను, నా స్నేహితులు శ్రీ కే. నాగేశ్వరరావు (BSNL) తో కలిసి శిరిడీ వెళ్ళాను. అప్పుడు సాయిని దర్శించుకొని ప్రతి సంవత్సరమూ నాకు 'శిరిడీ దర్శన భాగ్యం' కలుగజేయమని సాయిని ప్రార్థించాను. అప్పటినుండి ఇప్పటివరకు అనగా 1988 నుండి 2011 వరకు ఏ ఆటంకం లేకుండా ప్రతి సంవత్సరం నేను శిరిడి వచ్చి సాయి దర్శనం చేసే అదృష్టం గురువుగారు నాకు ప్రసాదించిన వరంగా భావించుచున్నాను. నా జీవితాంతం వరకు ప్రతి సంవత్సరం యిలాగే సాయి దర్శనం నాకు కలగాలని సాయిని, గురువు గారిని వేడుకుంటున్నాను.

## మంచి యొక్క ఫలితం గొప్పది

03వ పేజీ తరువాయి

నిరంతరము ఇంటి ఎదుట వేశ్యను గురించి జుగుప్సతో ఆలోచించేవాడట. ఫలితం? చివరకు శివదూతలు వేశ్యను కైలాసానికి, యమదూతలు ఆచారపరుడి ఆత్మను యమలోకానికి తీసుకొనిపోయారట. ఒకరి బాహ్యాచరణ నింద్యమైనదైనా అంతరంగం మంచినే చింతించింది. రెండవ వారి బాహ్యాచరణ శుద్ధమైనదైనా అంతరంగం కలుషితమైనది.

అందుకే మహనీయులు సత్వగుణ సంపదలో 'శౌచం' అన్న భావాన్ని వివరిస్తూ, శౌచం ప్రధానంగా ఆంతరంగికమన్నారు. భారతము కూడా ఇలానే చెబుతుంది.

సాధకుడూ, సద్గురు సాయిభక్తుడూ అయినవాడికి సాయి చూపిన దానిలో, మహర్షి రమణులు వివరించిన దానిలో యింత లోతున్నది. ఎవరిలోనైనా నిజంగా దోషం వుంటే దాని ఫలితం వారిది. మన భావానికి మనపైనే ప్రభావముంటుంది. వారి హితం మనము కోరితే, తిన్నగా వారినే ప్రేమతో ఒకటి రెండుసార్లు హెచ్చరించవచ్చు. ఆపై వారి కర్మకు వారిని విడిచి మన అంతరంగాన్ని శుద్ధంగా వుంచుకుని తొలగిపోవడమే సముచితమని సాయి తమ ఆచరణ ద్వారా చాటారు. మన హృదయానికి మనమెప్పుడూ మంచిని గురించి ఆలోచించడమే నేర్పారు.

## పరిప్రశ్న

05వ పేజీ తరువాయి

సాయిబాబా, రమణమహర్షి, రామకృష్ణ పరమహంస మొ॥న వారి చరిత్రలు, వారి బోధలు, వాటి సహాయంతో మాత్రమే భగవద్గీతాదుల శ్రవణం చేయించేట్లయితే; నేటి విద్యావంతులైన యువకులకు, ఆధునిక విజ్ఞానంతో సమన్వయం చేసిన ఆస్తిక బోధ, అట్టి అంశాలమీద వారికి వ్యక్తృత్వము, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లయితే మందిరాలు కావాలి. ఆలయ నిధులన్నీ యిట్టి కార్యక్రమాలకు వినియోగించాలి. అలా భావితరాలలో ఆస్తికదృష్టి, భక్తి శ్రద్ధలూ పెంపొందించకనే, ఆలయాలు కట్టడం ముందుముందు భక్తి శ్రద్ధలు లోపించడం దైవాన్ని కించపరచడమే అవుతుంది; మన సంస్కృతిని అపహాస్యం చేయడమే అవుతుంది. ఇందులో, చురుకుగా పని చేసి ప్రతిభను చూపే విద్యార్థులకు విద్య, ఉచిత పారితోషికాలూ ఏర్పాటు చేయాలి. ఉపాధ్యాయులకు అట్టి శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి నిధులు వినియోగపడాలి, తమనిధులిలా వినియోగించడం వల్లనే అటు యితర మత ధర్మాలు గాని, నాస్తిక హేతు – భౌతిక వాదాలు గాని నేడు విజృంభిస్తున్నాయని గుర్తించి తగురీతిన నిర్వహించగల్గుతే దేవాలయాలు కావాలి. కారణం అవి సార్థక నామధేయాలు.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹249.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹249.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |
| Sri Swami Samartha (Odiya) | ₹75.00 |